# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :214 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 29-10-2024 | పేజీలు:4 వెల: 2.00


## రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం

న్యూఢిల్లీ,దేశరాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రమవుతోంది. దీపావళి పండుగకు ముందే వాయు నాణ్యత దారుణంగా పడిపోయింది. పొరుగు రాష్ట్రాల్లో వ్యర్థాలను తగుల బెడుతుండడంతో ఢిల్లీలో కాలుష్యం పెరిగింది. దీనికి తోడు పొగమంచు కూడా రాజధాని ప్రాంతాన్ని ఆవహించింది. దీంతో నగరంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ అధ్వానస్థితికి చేరినట్లు కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది. సోమవారం ఉదయం ఢిల్లీలో ఏక్యూఐ 328 వద్ద నమోదైనట్లు కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది. ముఖ్యంగా ఆనంద్ విహార్ ప్రాంతంలో గాలి నాణ్యత ప్రమాదకరంగా మారింది. ఇక్కడ సోమవారం ఉదయం 7 గంటల సమయంలో ఏక్యూఐ 357 గా నమోదైనట్లు పేర్కొంది. ఇక అక్షర్‌ధామ ఆలయం వద్ద 357గా గాలి నాణ్యత నమోదైనట్లు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ తెలిపింది. నగరంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి ఉన్నట్లు వెల్లడించింది. గాలి నాణ్యత క్షీణించడంతో ఢిల్లీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## ముడా కేసులో పలు చోట్ల ఈడీ దాడులు




బెంగళూర్ : కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) మనీలాండరింగ్ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోమవారం తాజా సోదాలు నిర్వహించినట్లు మీడియా నివేదికలు తెలిపాయి.కర్ణాటకలోనిమైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) సంబంధించిన లింక్డ్ మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోమవారం మంగళూరు, బెంగళూరు, మాండ్య, మైసూరులోని పలు ప్రదేశాలలో సోదాలు నిర్వహించినట్లు సమాచారం.ఈ కేసులో సిద్ధరామయ్యపై కేసు నమోదు చేసిన ఈడీ బిల్డర్ మంజునాథ్ ఇల్లు, కార్యాలయంలో సోదాలు నిర్వహించింది. గతంలో అక్టోబర్‌లో, భూ కుంభకోణంపై విచారణకు సంబంధించి ముడా మైసూరు తాలూకా కార్యాలయాలపై ఈడీ రెండు బృందాలు దాడులు నిర్వహించాయి. ముడా కుంభకోణానికి సంబంధించి లోకాయుక్త దాఖలు చేసిన ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ ను పరిగణనలోకి తీసుకున్న ఈడీ.. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై కేసు నమోదు చేసింది.సిద్ధరామయ్యతో పాటు ఆయన భార్య బీఎం పార్వతి, బావమరిది మల్లికార్జున స్వామి, దేవరాజుల నుంచి భూమి కొనుగోలు చేసి పార్వతికి కానుకగా ఇచ్చిన దేవరాజు తదితరుల పేర్లను సెప్టెంబర్ 27న లోకాయుక్త పోలీసులు నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌లో పేర్కొన్నారు. సిద్ధరామయ్య భార్యకు మైసూరులోని ఒక ఉన్నత మార్కెట్ ప్రాంతంలో కేటాయించిన కాంపెన్సేటరీ సైట్లు ఆమె నుంచి ముడా ద్వారా సేకరించిన భూమి కంటే చాలా ఎక్కువగా ఉన్నాయని ఆరోపణలు వచ్చాయి. బీఎన్ పార్వతి తన కుటుంబంపై అవినీతి కేసుల్లో కేంద్రంగా ఉన్న భూములను తిరిగి ఇవ్వాలని అధికార యంత్రాంగానికి లేఖ రాశారు. తన మనస్సాక్షి పిలుపుకు కట్టుబడి ఉన్నానని పార్వతి ఒక ప్రకటనలో తెలిపారు. "ఈ ప్లాట్లను తిరిగి ఇవ్వడంతో పాటు, ముడాకు సంబంధించిన అన్ని ఆరోపణలపై సమగ్ర దర్యాప్తును కూడా నేను డిమాండ్ చేస్తున్నాను" అని ఆమె తెలిపారు.ముడాకు రాసిన లేఖలో, పార్వతి విజయనగరం ఫేజ్ 3, 4లో తనకు కేటాయించిన 14 ప్లాట్లను కేసరే గ్రామంలోని 3.16 ఎకరాల భూమి వినియోగానికి పరిహారం బదులుగా తిరిగి ఇవ్వాలని ప్రతిపాదించింది. తాజాగా 14 ప్లాట్లను వెనక్కి తీసుకునేందుకు ముడా అంగీకరించింది. సిద్ధరామయ్య ఎలాంటి తప్పు చేయలేదని, తనపై వచ్చిన ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమని పేర్కొన్నారు.

## పీఏసీ చైర్మన్ పదవి ప్రతిపక్షాలకు ఇవ్వడం సంప్రదాయం




హైదరాబాద్: పీఏసీ చైర్మన్ పదవి ప్రతిపక్షాలకు ఇవ్వడం సంప్రదాయమని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి (వేముల ప్రశాంత్ రెడ్డి) అన్నారు. పీఏసీ చైర్‌పన్ ప్రజాధనం ఖర్చు పెట్టడంలో లోటుపాట్లపై సలహాలు ఇవ్వాలన్నారు. నాగం జనార్దన్‌రెడ్డి, ఎనమల రామకృష్ణుడు నాడు పీఏసీ చైర్మన్‌లుగా ఉన్నారు. లోక్‌సభలో కూడా గత పదేండ్లుగా ప్రతిపక్ష నాయకులు పీఏసీ చైర్మన్‌లుగా ఉన్నారు. ఇవాళ కూడా పీఏసీ కమిటీ సమావేశంలో ఇదే ప్రస్తావించాం. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీలు ఎల్ రమణ, సత్యవతి రాథోడ్‌తో కలిసి ప్రశాంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. అరికెపూడి గాంధీ ప్రతిపక్ష సభ్యుడేనని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఫిరాయింపుదారులతో సాక్షాత్తు సీఎం రేవంత్ రెడ్డి సమావేశాలు జరిగాయి. జీవన్‌రెడ్డి లేఖపై శ్రీధర్‌బాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకోవాలని, ఆస్తులు కాపాడుకోవడానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారారని మధుయాష్కి గౌడ్ అన్నారని గుర్తుచేశారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బుల్డోజ్ రాజకీయాలు చేస్తున్నదని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్. గాంధీని కాంగ్రెస్ సభకు ఒప్పుకునే ధైర్యం రేవంత్ రెడ్డికి ఉందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ దాగుడు మూతలు ఆడుతున్నాడని. ఆ పార్టీలో నాయకులే లేరా అని నిలదీశారు. గాంధీని అడ్డం పెట్టుకుని రేవంత్ రాజకీయాలు చేస్తున్నాడని. కాంగ్రెస్ పార్టీ రాజకీయాలను భ్రష్టు పట్టిస్తున్నదని. శాసనసభ సంప్రదాయాలకు విరుద్ధంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని ఎమ్మెల్సీ ఎల్ రమణ అన్నారు. ప్రతిపక్ష నాయకుడి సూచన మేరకు పీఏసీ చైర్మన్‌ను నియమించాలన్నారు.

## వాలంటీర్ల విషయంలో బాబు సంచలన నిర్ణయం

విజయవాడ:ఏపీలో వాలంటీర్ల వ్యవస్థను గత వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఆశయం మంచిదే కానీ ఆచరణలో గాడి తప్పింది. ఆఖరుకు ఎంతలా అంటే వారిని వైసీపీ కార్యకర్తలుగా ఏకంగా మంత్రుల నుంచి ప్రభుత్వ పెద్దల దాకా అంతా బాహాటంగానే చెప్పుకొచ్చారు. దాని వల్ల మేలు కంటే కీడే జరిగింది.కేంద్ర ఎన్నికల సంఘం జోక్యంతో వాలంటీర్లు ఎన్నికల ముందు తప్పుకోవాల్సి వచ్చింది. అయితే వైసీపీ నేతలు మాత్రం వారి చేత రాజీనామాలు చేయించి అధికారికంగా పార్టీ కోసం పని చేయించుకున్నారు. ఆ విధంగా మొత్తం ఏపీలోని రెండున్నర లక్షల మంది వాలంటీర్లలో లక్ష మంది దాకా తప్పుకున్నారు.అయితే వాలంటీర్లను తమ ప్రభుత్వం వస్తే బాగా చూసుకుంటామని వారికి పది వేల గౌరవ వేతనం ఇవ్వడం ద్వారా సేవలను కొనసాగిస్తామని టీడీపీ కూటమి నేతలు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఇక ఎన్నికలు ముగిసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కానీ వాలంటీర్ల విషయంలో అయితే ఎటూ తేల్చలేదు. దాంతో వారు ఉద్యమబాట పడతామని హెచ్చరిస్తున్నారు అయితే మంత్రి వర్గ సమావేశాలలో వాలంటీర్ల ప్రస్తావన వస్తోంది కానీ ఎటూ తేల్చలేకపోతున్నారు. వాలంటీర్ల వ్యవస్థ వల్ల వైసీపీకి మంచి కంటే చెడ్డ ఎక్కువ మూటకట్టుకుని పరిస్థితి వచ్చిందని టీడీపీలో అత్యధికులు అభిప్రాయపడుతు న్నారు. దాంతో పాటుగా వారు వస్తే ప్రజా ప్రతినిధుల ప్రాధాన్యత తగ్గిపోతుందని కూడా భావిస్తున్నారు. అందుకే వారిని కంటిన్యూ చేయడానికి ఒప్పుకోవడం లేదు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు మదిలో మాత్రం వాలంటీర్ల వ్యవస్థ విషయంలో కచ్చితమైన అభిప్రాయాలు ఉన్నాయని అంటు న్నారు. వాలంటీర్లను కొనసాగించాలని ఆయన అనుకుంటున్నట్లుగా తెలుస్తోం ది.వాలంటీర్లలో నిజాయితీపరులను చిత్తశుద్ధి కలిగిన వారిని పనితీరు బాగా తెలిసిన వారిని విద్యార్హతలు బట్టి తీసుకుని వారికి స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ఇప్పించి



సేవలు వాడుకోవాలని బాబు ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. వాలంటీర్లను కొన్ని రకాల ప్రభుత్వ సేవలకు ఉపయోగించుకోవడం ద్వారా వారి ద్వారా ప్రభుత్వానికి ప్రజలకు మధ్య బలమైన వారధిని ఏర్పాటు చేసుకోవాలని బాబు ఆలోచిస్తున్నారు అని అంటున్నారు.వైసీపీ వాలంటీర్ల విషయంలో చేసిన తప్పులు చేయకుండా బాగా నడిపిస్తే మంచి వ్యవస్థగా ఉంటుందని కూడా ఆయన భావిస్తున్నారు అని అంటున్నారు. ఇక మొత్తం వాలంటీర్లను తీసుకోవడం కంటే రాజీనామా చేసిన వారిని పక్కన పెట్టి మిగిలిన వారిలో కూడా సరైన ఎంపిక చేసుకుని అవసరమైన మేరకు తీసుకోవడం ద్వారా మాట నిలబెట్టుకోవాలని కూటమి ప్రభుత్వం ఆలోచిస్తోంది అని అంటున్నారు. మొత్తం మీద చూసుకుంటే వాలంటీర్ల వ్యవస్థ తొందరలోనే పురుడు పోసుకోనుందని అంటున్నారు.నవంబర్ 6న జరిగే మంత్రి వర్గ సమావేశంలో ఈ మేరకు ఒక మంచి నిర్ణయం వెలువడుతుందని అంటున్నారు. ఈసారి వచ్చే వాలంటీర్లు టీడీపీ శిక్షణలో తర్ఫీదు తీసుకుని జనంలోకి వెళ్తారని అంటున్నారు.

## జగన్ చేయి పట్టుకున్నోళ్లంతా పాతాళానికే



అమరావతి,అక్టోబర్28: తల్లి, చెల్లిపై కేసులేయడంతో వైకాపా అధ్యక్షుడు జగన్ పాతాళంలో కూరుకు పోయారని తెదేపా సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. ఆయన చేయి పట్టుకున్నోళ్లంతా పాతాళంలోకే అని ఎద్దేవా చేశారు. ఆస్తుల వివాదం కాదు.. ఇది రాజకీయ ఆత్మహత్యే అని పేర్కొన్నారు. చివరికి జగన్ తన సొంత తల్లి, చెల్లిని కూడా మోసం చేశారన్నారు. షర్మిలకు ఇచ్చిన రూ.200 కోట్లు ఆయనకు ఎక్కడివని ప్రశ్నించారు. రూ.200 కోట్లు ఇచ్చానని పేర్కొన్నా.. ఐటీ, ఈడీ ఎందుకు స్పందించట్లేదన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ఎన్‌సీఎల్‌టీలో తల్లిపై, చెల్లిపై కేసులేయడం ద్వారా జగన్ పూర్తిగా పాతాళానికి కూరుకుపోయారన్నారు. ..ఒక ఆర్థిక నేరస్థుడు 11 ఏళ్లుగా బెయిల్‌పై ఉండటమేంటి? ఇప్పటికే అనేక మంది వైకాపాను వీడుతున్నారు. భవిష్యత్తులో జగన్ మళ్లీ అధికారంలోకి వస్తారనుకోవడం పగటి కలే. ఇవాళ కాకపోతే రేపైనా జగన్ జైలుకెళ్లడం ఖాయం. పాత కేసులకు తోడు కొత్త కేసులు ఆయనపై సిద్ధంగా ఉన్నాయని యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. రాజకీయాల్లో హత్యలు ఉండవని.. ఆత్మహత్యలే ఉంటాయనడానికి జగన్మోహన్ రెడ్డి రాజకీయ జీవితమే తాజా ఉదాహరణ అని యనమల రామకృష్ణుడు అన్నారు. అందులో నుంచి అతన్ని బయటకు తీయడం దేవుడెరుగు, జగన్ చేయి పట్టుకున్నోళ్లంతా పాతాళంలోకే అంటూ వ్యాఖ్యలు చేశారు. ఇది ఆస్తుల వివాదం కాదని.. ఇది రాజకీయ ఆత్మహత్యే అని.. చివరికి జగన్ తన సొంత తల్లిని, చెల్లిని కూడా మోసం చేశారంటూ మండిపడ్డారు. వాళ్ల కుటుంబ తగాదాలు వాళ్లే రోడ్డుకీడ్చుకుని ఆ బురద మీడియాపైకి నెట్టడం హాస్యాస్పద మన్నారు. షర్మిలకిచ్చిన రూ.200 కోట్లు జగన్‌కు ఎక్కడివని ప్రశ్నించారు. 10 ఏళ్లలో రూ. 200 కోట్లు ఇచ్చానని జగన్ పేర్కొన్నా ఇప్పటికీ ఐటీ, ఈడీ ఎందుకు స్పందించడంలేదని అడిగారు. గత నాలుగైదు రోజులుగా పుంఖానుపుంఖాలుగా జగన్ అక్రమాస్తుల రగడ మీడియాలోనే కాదు, పబ్లిక్‌గా జరుగుతుంటే ప్రభుత్వాలు, న్యాయస్థానాలు, దర్యాప్తు సంస్థల్లో కదలికలేవి అని నిలదీశారు. క్విడ్ ప్రో కో 1.0, క్విడ్ ప్రో కో 2.0 ప్రో కో కేసులన్నీ ఇప్పటికైనా ఒక కొలిక్కి తేవాలని.. ఒక ఆర్థిక నేరస్తుడు 11 ఏళ్లుగా బెయిల్‌పై ఉండటమేమిటని అన్నారు. 136 డిశ్చార్జి పిటిషన్లు వేసి తనపై కేసుల విచారణను ముందుకు సాగకుండా ఆర్థిక ఉగ్రవాది ఇలా న్యాయవ్యవస్థకే కొరుకుడు పడని కొయ్యగా మారితే, దర్యాప్తు సంస్థలకే పెను సవాళ్లు విసురుతుంటే భారత రాజ్యాంగం ఉనికికే ప్రమాదమన్నారు. భారత శిక్షాస్మృతికే అవమానమన్నారు.కుటుంబ యుద్ధం - అక్రమాస్తుల కోసం సిగపట్లు - జగన్ పొలిటికల్ సూసైడ్ అంటూ వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే అనేక మంది వైసీపీని వీడుతున్నారని.. సురక్షిత ఆశ్రయం కోసం వేరే పార్టీల్లో చేరుతున్నారని అన్నారు. ఇక భవిష్యత్తులో జగన్ మోహన్ రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తారనుకోవడం పగటికలే అని.. అందుకే ఎవరికి వారు దీపం ఉండగానే ఇల్లు చక్కపెట్టుకోవాలన్న ఆరాటంతో ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్‌గా పోటీబడి వైసీపీ నుంచి దూకేస్తున్నారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సగం మునిగిపోయిన నావ, పూర్తిగా మునిగిపోకముందే అందరూ దూకేయడం బెటర్ అని ఉచిత సలహా ఇచ్చారు. ఇవాళ కాకపోతే రేపైనా జగన్ జైలుకెళ్లడం ఖాయమని.. పాత కేసులకు తోడు కొత్త కేసులు అనేకం ఆయన్ని మింగేయడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో జగన్‌తో ఉంటే అది ఆత్మహత్యాసదృశ్యమే అంటూ వ్యాఖ్యలు చేశారు. కొడుకుగా తల్లిదండ్రులను మోసం చేశాడు. అన్నగా చె÷-లలెల్లకు మోసం చేశాడు. పార్టీ పెట్టి నాయకులను, కార్యకర్తలను మోసం చేశాడు. అధికారం చేపట్టి అన్నివర్గాల ప్రజలను మోసం చేశాడని అంటూ మండిపడ్డారు. అవినాష్ రెడ్డిని కాపాడటం కోసం సొంత చిన్నాన్న కుటుంబాన్నే మోసం చేశారన్నారు. చిన్నాన్నను కిరాతకంగా హత్య చేసిన హంతకులకు రక్షణ కల్పించడమే కాదని.. ఆ పాపంలో తానూ భాగస్వామి అయ్యారన్నారు. చిన్నమ్మ సౌభాగ్యమ్మ, చెల్లి సునీత ఉసురు పోసుకున్నారని.. వాళ్ల కన్నీళ్లే వైసీపీకి శాపాలయ్యాయన్నారు. ఇప్పుడు ఏకంగా తల్లిని, చెల్లిని ఏడిపిస్తున్నాని.. సీఎంగా గత ఐదేళ్లలో 8 లక్షల కోట్ల అవినీతి కుంభకోణాలు చేశారంటూ యనమల రామకృష్ణుడు ఆరోపణలు గుప్పించారు.

## 'గగన్‌యాన్' మిషన్‌పై ఇస్రో కీలక అప్‌డేట్



న్యూఢిల్లీ, అక్టోబర్ 28: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో చైర్మన్ సోమనాథ్ కీలక ప్రకటన చేశారు. అంతరిక్షానికి మినిషిని పంపించే లక్ష్యంగా నిర్దేశించుకున్న మొట్టమొదటి మానవ సహిత మిషన్ 'గగన్‌యాన్' మిషన్‌కు సంబంధించి కీలక అప్‌డేట్ ఇచ్చారు. ముందుగా అనుకున్నట్లు 2025లో కాకుండా.. ఈ మిషన్‌ను 2026లో చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఆల్ ఇండియా రేడియోలో సర్దార్ పటేల్ మెమోరియల్ లెక్చర్ సందర్భంగా సోమనాథ్ ఈ కొత్త షెడ్యూల్‌ను వెల్లడించారు. చంద్రయాన్-3, మిషన్ ఆదిత్య ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించి సరికొత్త చరిత్ర సృష్టించిన ఇస్రో ఆ ఊపుతో.. తొలిసారిగా మానవులను అంతరిక్షంలోకి పంపే గనన్‌యాన్ యాత్రను చేపట్టేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. నలుగురు వ్యోమగాములను అంతరిక్షంలోకి మూడు రోజుల పాటు పంపి, సురక్షితంగా వారిని భూమిపైకి తేవడమే ఈ మిషన్ లక్ష్యం. ఆగస్టులో చంద్రయాన్-3 విజయవంతం తర్వాత తదుపరి మిషన్ అయిన గగన్‌యాన్ కోసం సిబ్బంది రేయింబవళ్లు చేసిన కృషితో ఈ మిషన్ సిద్ధమవుతున్నట్లు ఇస్రో చీఫ్ ఇటీవలే వెల్లడించారు. గగన్‌యాన్ మిషన్‌లో ఇస్రో వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపనున్నది. ముగ్గురు వ్యోమగాములను దాదాపు 400 కిలోమీటర్ల ఎత్తయిన కక్ష్యలోకి చేర్చి.. తిరిగి వారిని భూమిపైకి తీసుకురావాలని నిర్ణయించింది. ఈ ప్రయోగం మూడు రోజులపాటు జరుగనున్నది. వ్యోమగాములు తిరుగు ప్రయాణంలో సముద్రంపై సురక్షితంగా దిగాల్సి ఉంటుంది. వాస్తవానికి 2022లోనే ప్రాజెక్టు చేపట్టాల్సి ఉండగా.. కరోనా కారణంగా వాయితా పడుతూ వచ్చింది. ఇస్రో చేపట్టిన ఈ మిషన్ విజయవంతమైతే అమెరికా, చైనా, సోవియట్ యూనియన్ తర్వాత ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ అవతరించనున్నది. మరోవైపు రానున్న సంవత్సరాల్లో భారత్ చేపట్టనున్న అంతరిక్ష యాత్రల వివరాలను కూడా సోమనాథ్ వెల్లడించారు. శాంపిల్ రిటర్న్ మిషన్ చంద్రయాన్-4 2028లో ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఇక భారత్-అమెరికా సంయుక్తంగా చేపట్ట దలచిన నిసార్ మిషన్‌పై కూడా సోమనాథ్ కీలక అప్‌డేట్ ఇచ్చారు. ఈ మిషన్‌ను వచ్చే ఏడాది అంటే 2025లోనే ప్రారంభించే అవకాశం ఉందని తెలిపారు. జపాన్ అంతరిక్ష పరిశోధన సంస్థ జగ్జాతో చంద్రయాన్-5 మిషన్ ప్రయోగం చేపట్టనున్నామని, ఇది మూన్-ల్యాండింగ్ మిషన్ అని వివరించారు. ఈ మిషన్ అసలు పేరు లుపెక్స్ లేదా 'లునార్ పోలార్ ఎక్స్‌ప్లోరేషన్' అని చెప్పారు. అయితే ఈ ప్రయోగాన్ని ఎప్పుడు చేపడతారన్న సమయాన్ని ఆయన వెల్లడించలేదు. అయితే ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం 2025లో ఈ ప్రయోగం చేపట్టాల్సి ఉంటుంది. కానీ ఇప్పుడు ఆ ప్రాజెక్టుని చంద్రయాన్-5గా సోమనాథ్ పేర్కొన్నారు కాబట్టి చంద్రయాన్-4 పూర్తయిన తర్వాత 2028లో చేపట్టే సూచనలు కనిపిస్తున్నాయి.

### వైఎస్ఆర్ హుందాగా బతికారు

అమరావతి, వైఎస్సార్ కుటుంబంలో ఆస్తి పంచాయితీ కొనసాగుతోంది. మాజీ సీఎం వైఎస్ జగన్, ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఆస్తుల పంపకాలకు సంబంధించి ఒకరిపై ఒకరు లేఖస్త్రాలు సంధిస్తూ విమర్శలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆస్తుల పంచాయతీపై మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి స్పందించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి 40 ఏళ్ళ రాజకీయాల్లో ఎంతో

## భవిష్యత్తులో యుద్ధ విమానాలనూ ఎగుమతి చేస్తాం

వడోదర:భారతదేశంలో ప్రైవేట్ రంగంలో తొలి యుద్ధ విమానాల తయారీ కర్మాగారం అందుబాటులోకి వచ్చింది. గుజరాత్‌లోని వడోదరలోని టాటా ఎయిర్‌క్రాఫ్ట్ కాంప్లెక్స్‌లోని నెలకొల్పిన సి-295 సైనిక రవాణా విమానాల ఉత్పత్తి ఫ్యాక్టరీని స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్‌తో కలిసి భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. వచ్చే ఏడాది సెప్టెంబరు నుంచి ఉత్పత్తి మొదలవుతుంది. C-295 విమానాల FAL ప్లాంట్‌కు ప్రధాని మోదీ 2022లో శంకుస్థాపన చేశారు. సైన్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు చేపడుతోన్న కేంద్రం.. స్పెయిన్ నుంచి రఫేల్ యుద్ధ విమానాలతో పాటు సైనిక రవాణా విమానాల కొనుగోలుకు ఒప్పందం చేసుకుంది. ఈ క్రమంలో సీ 295 సైనిక రవాణా విమానాలను రూ.21 వేల కోట్లతో కొనుగోలు చేసింది. ప్రపంచ వ్యాప్తంగా సీ-295 రకం మిలటరీ ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న మిలటరీ ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల కంటే శక్తివంతమైన ఇంజిన్, ఎక్కువ బరువును మోసుకెళ్లే సామర్థ్యం సీ-295 సొంతం. దీంతో 6 దశాబ్దాలుగా వినియోగిస్తున్న Avro-748 ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను వీటితో భర్తీ చేయాలని కేంద్రం నిర్ణయించింది. 2021 సెప్టెంబర్‌లో భారత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ప్రకారం 56 విమానాల్లో 16 విమానాలను నేరుగా తయారు చేసి అప్పగించడంతో పాటు మరో 40 విమానాలను భారత్‌లోనే తయారు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్‌తో కలిసి గుజరాత్‌లోని వడోదరలో ప్లాంట్ ఏర్పాటు చేసింది. సైనిక అవసరాల కోసం భారత దేశంలో ఏర్పాటైన తొలి



ప్రైవేట్ సెక్టార్ అసెంబ్లీ లైన్ కూడా ఇదే. ఈ ప్లాంట్ నుంచి తొలి విమానం 2026 సెప్టెంబర్‌లో బయటకు రానుంది. అప్పటి నుంచి మొదలుపెట్టి 2031 ఆగస్ట్ నాటికి మొత్తం 40 విమానాలను ఇక్కడ తయారు చేస్తారు.ప్రారంభోత్సవ వేడుకలో ప్రధాని మోదీ మాట్లాడుతూ వడోదరలో తయారు చేసిన విమానాలను భవిష్యత్తులో ఎగుమతి చేస్తామని చెప్పారు. "టాటా-ఎయిర్‌బస్ తయారీ కేంద్రం భారతదేశం-స్పెయిన్ సంబంధాలను, 'మేక్ ఇన్ ఇండియా, మేక్ ఫర్ ది వరల్డ్' మిషన్‌ను బలోపేతం చేస్తుందని తెలిపారు. C-295 విమానాల FAL ప్లాంట్‌కు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ 2022, అన్నారు. ఈ సందర్భంగా టాటా సన్స్ మాజీ ఛైర్మన్ రతన్ టాటాకు కూడా ప్రధాని మోదీ నివాళులు అర్పించారు. ఈ ప్రాజెక్ట్ వెనుక ఉన్న మేధావులు.. టాటా ఈ నెల ప్రారంభంలో 86 సంవత్సరాల వయస్సులో మరణించారంటూ గుర్తుచేసుకున్నారు.

## సంపాదకీయం

మంగళవారం 29-10-2024

# ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం

భారత ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని వివిధ ప్రభుత్వ శాఖలు ఇటీవల విడుదల చేసిన వివిధ గణాంకాలు విదితం జేస్తున్నాయి. రూపాయి విలువ క్షీణించడం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, స్టాక్ మార్కెట్ నుండి విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, విపరీతమైన విదేశీ రుణాలు, విదేశీ వాణిజ్య లోటు వంటివి మన ఆర్థిక వ్యవస్థ దుస్థితిని వెల్లడిస్తున్నాయి. ఏడు శాతం వృద్ధితో ఆర్థికాభివృద్ధిలో భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామిగా ఉందని మోదీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకొంటున్నా 90 శాతం మంది ప్రజలకు దీని ప్రయోజనాలు అందడం లేదన్నది కఠోర వాస్తవం. ప్రజలు ఎదుర్కొంటున్న అసలైన ధరల పెరుగుదల ప్రభుత్వ గణాంకాలకు అందనంత! పెరుగుతున్న నిరుద్యోగం, వేతన పెరుగుదల లేకపోవడం ప్రజల కొనుగోలు శక్తిని క్షీణింపజేసింది. ఏడు శాతం వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ చలనశీలంగా కాకుండా స్తబ్దుగా ఉంది. భారత ఆర్థిక వ్యవస్థ స్థిరత్వంపై విదేశీ పెట్టుబడిదారులు విశ్వాసం కోల్పోయారు. విదేశీ మదుపరులు తమ పెట్టుబడులను భారతీయ స్టాక్ మార్కెట్ నుంచి ఉపసంహరించుకుంటున్నారు. విదేశీ మదుపరులు ఈ నెలలో ఇప్పటివరకు రూ.85,000 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో, భారతీయ కంపెనీల ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉండడంతో విదేశీ పెట్టుబడిదారులు దూరమవుతున్నారు. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు చైనా ఉద్దీపన ప్యాకేజీని ప్రకటించడం భారత మార్కెట్లను కూడా తాకింది. ప్రపంచ ఆర్థిక మాంద్యం కారణంగా 2008లో భారతీయ స్టాక్ మార్కెట్ నుండి విదేశీ పెట్టుబడులు ఉపసంహరించబడ్డాయి. అప్పట్లో అది పెద్ద ప్రభావం చూపింది. రూపాయి విలువ క్షీణతకు అది కూడా కారణమైంది. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి అత్యధికంగా నష్టపోయింది. మొన్నటిరోజు డాలర్ విలువ రూ.84.07 పైసలు. ఆ మారకపు విలువను కొనసాగించేందుకు రిజర్వ్ బ్యాంక్ తన నిల్వల నుంచి పెద్ద మొత్తంలో డాలర్లను విడుదల చేస్తోంది. ఇది విదేశీ మారక నిల్వలను కూడా తగ్గిస్తుంది. మోదీ ప్రభుత్వం 2014 మేలో అధికారంలోకి వచ్చినప్పుడు డాలర్ మారకం విలువ రూ.59.44 పైసలు కాగా పదేళ్లలో దాదాపు రూ.25 పడిపోయి రూ.84కి దిగజారింది. విదేశీ వాణిజ్య లోటు కూడా పెరుగుతోంది. ఆగస్టులో వాణిజ్య లోటు 2,970 డాలర్లకు పెరిగింది. గతేడాది ఆగస్టులో ఇది 2,421 కోట్లు. భారతదేశ ఎగుమతులు చాలా బలహీన స్థితిలో ఉన్నాయి. పెరుగుతున్న ద్రవ్యోల్బణం ప్రజల కొనుగోలు శక్తిని కూడా తగ్గిస్తుంది. సెప్టెంబర్‌లో వస్తు, సేవల పన్ను వసూళ్లే ఇందుకు నిదర్శనం. 40 నెలల్లో అత్యల్ప వృద్ధి రేటు (-) 6.5 శాతం నమోదైంది. ప్రస్తుత ద్రవ్యోల్బణం రేటుతో పోలిస్తే సెప్టెంబర్‌లో జీఎస్టీ ఆదాయం పెద్దగా పెరగలేదు. బొగ్గు, విద్యుత్, ముడి చమురు ప్రాసెసింగ్, మైనింగ్ వంటి ఎనిమిది కీలక రంగాల్లో ఉత్పత్తిపై ఆధారపడిన పారిశ్రామికోత్పత్తి సూచీ ఆగస్టులో ప్రతికూల వృద్ధిని నమోదు చేసింది. గత ఏడాదితో పోలిస్తే సెప్టెంబర్‌లో కార్ల విక్రయాలు 19 శాతం తగ్గాయి. సేవల రంగ సూచీ కూడా 10 నెలల కనిష్టానికి చేరింది. ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో గృహ రుణాల పంపిణీ తొమ్మిది శాతం పడిపోయింది. బలమైన మరియు చలనశీలమైన ఆర్థిక వ్యవస్థకు అవసరమైన ఇటువంటి అంశాలు క్షీణిస్తున్నాయి. పేలవమైన ఆర్థిక విధానాల ఫలితంగా మధ్యతరగతి, దిగువ తరగతులవారి ఆదాయం తగ్గింది. దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య కొనుగోలు శక్తి లేకపోవడం. కొనుగోలు శక్తి కోవిడ్ పూర్వ స్థాయికి చేరుకోలేదని చాలా సూచికలు చూపిస్తున్నాయి. కొనుగోలు శక్తిని పెంచుకోవాలంటే దిగువన ఉన్న 50 శాతం మంది చేతిలో ఎక్కువ డబ్బు రావాలి. కానీ కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, ఇతర సంక్షేమ పథకాల కేటాయింపులు పెంచడం లేదు. దానికి బదులుగా, కార్పొరేట్లకు పన్ను మినహాయింపులతో సహా భారీ సబ్సిడీలు ఇస్తోంది. మాంద్యం నుంచి ఆర్థిక వ్యవస్థను కాపాడేందుకు ప్రత్యేక ప్యాకేజీలను అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధం కావాలి. అలా చేయాలంటే ప్రజా ఒత్తిడి పెంచాలి.

# ఏడాదిలోపే కథ తారుమారు



హైదరాబాద్,రోమ్ నగరం తగలబడిపోతుంటే రోమన్ చక్రవర్తి ఫిడేల్ వాయిస్తూ కూర్చున్నాడట. తెలంగాణలో కాంగ్రెస్ పాలన అందుకు ఏ మాత్రం తీసిపోని విధంగా ఉన్నది. రాష్ట్రంలో ప్రభుత్వం కొలువుదీరి ఏడాది కావస్తున్నా అసలు పాలన లేనట్టే అనిపిస్తున్నది. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన నాటినుంచి రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడింది. అసలు విషయాల కంటే కొసరుపైనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువగా దృష్టిపెడుతుండటమే అందుకు ప్రధాన కారణం. ఆరు గ్యారెంటీలతో పాటు వందల హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రతీ వేదికపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మొదలుకుని గల్లీ లీడర్ల వరకు ఊదరగొట్టారు. తీరా అధికారంలోకి వచ్చాక తమ నిజస్వరూపాన్ని బయటపెట్టుకున్నారు. ము ఖ్యంగా రైతులను ఊరిస్తూ అనేక ఉచిత హామీలను గుప్పించిన కాంగ్రెస్ ఇప్పుడు వారిని నట్టేట ముంచింది. ‘ఇప్పుడే బ్యాంకులకు వెళ్లి రుణాలు తెచ్చుకోండి.మేం గద్దెనెక్కగానే మీ రుణాలన్నీ మాఫీ చేస్తం’ అంటూ డంబాచారాలు పలికిన రేవంత్.. ఏరు దాటాక అన్నట్టుగా రైతుల నోట్లో మట్టికొట్టారు. మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్‌తో ఆగమాగమై ఊరూరా కనిపించిన దేవుళ్లందరిపై ఒట్టు వేసిన రేవంత్.. సగం సగం మాఫీ చేసి ఎగనామం పెట్టారు. రుణమాఫీ కోసం రైతులు రోడ్డెక్కుతుండటమే అందుకు నిదర్శనం. అంతేకాదు, పంటకు బోనస్ హామీ ఉత్త బోగస్‌గా మారిపోయింది. రైతుభరోసా పేరిట ఇస్తామన్న రూ.7,500 దక్కకపోగా కేసీఆర్ సర్కార్ ఇచ్చిన రూ.5 వేలకు కూడా ఇప్పుడు దిక్కు లేదు.ఆసరా పింఛన్ పెంపు మాట ఎత్తడం లేదు. మహిళలకు ఇస్తామన్న రూ.2,500 ఊసే లేదు. తులం బంగారం ఏమో గాని కల్యాణలక్ష్మి కూడా అందడం లేదు. ఈ పది నెలల పాలనలో సీఎం రేవంత్‌రెడ్డి ఏ ఒక్క హామీ అయినా నెరవేర్చారా? ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు పదో తరగతి పాసైతే రూ.10 వేలు, ఇంటర్ పాసైతే రూ.15 వేలు, డిగ్రీ పూర్తి చేస్తే రూ.25 వేలు, పీజీ పూర్తి చేస్తే రూ.లక్ష, పీహెచ్‌డీ పూర్తి చేసినవారికి రూ.5 లక్షల చొప్పున అందిస్తామని ఎన్నికల వేళ బీరాలు పలికిన రేవంత్‌రెడ్డి నేడు యువత నెత్తిన కుచ్చుటోపీ పెట్టారు.పరిపాలనపై అవగాహన లేకపోవడంతో ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రజల దృష్టిని మరల్చే రాజకీయాలకు కాంగ్రెస్ సర్కార్ తెరలేపింది. ఈ క్రమంలోనే రాష్ట్రంలో వేల సమస్యలున్నా వాటిని పట్టించుకోవడం లేదు. పైగా హైడ్రా, మూసీ సుందరీకరణ పేరిట ఇండ్లను కూలుస్తూ పేదల బతుకులను బజారుకీడుస్తున్నది. చివరికి ఈ హైడ్రామా బెడిసికొట్టి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావటంతో తోకముడవాల్సి వచ్చింది. అసలు మూసీ మురికికూపంగా మారడానికి నాటి కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలే కారణం. నాటి ప్రభుత్వాల అనుమతితోనే మూసీ చుట్టూ కాలనీలు వెలిశాయన్నది వాస్తవం కాదా? హైదరాబాద్ ప్రతిష్టను అనతికాలంలోనే డ్యామేజ్ చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుంది. కాంగ్రెస్ సర్కార్ నిర్వాకం వల్ల విశ్వనగరం అన్‌సేఫ్ సిటీగా మారిపోయింది. కూల్చివేతల కారణంగా నగరానికి పెట్టుబడులు రావడం లేదు. రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. ముఖ్యంగా ప్రజల్లో అభద్రతాభావం పెరిగింది.ఇదిలా ఉంటే రాష్ట్రంలో అనేక సమస్యలు పేరుకుపోయాయి. శాంతిభద్రతలు అదుపు తప్పాయి. హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయి. జగిత్యాల జిల్లాలో జరిగిన పాలక పార్టీ నాయకుడి హత్యే అందుకు ఉదాహరణ. ప్రశాంత తెలంగాణలో మత ఘర్షణలు జరిగే పరిస్థితి దాపురించింది. జీవో 29 విషయంపై శాంతియుతంగా నిరసన చేస్తున్న నిరుద్యోగులపై లాఠీలు విరిగాయి. చివరికి చట్టాన్ని కాపాడాల్సిన పోలీసుల కుటుంబాలు సైతం వారి హక్కుల కోసం రోడ్డెక్కే పరిస్థితి వచ్చిందంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇలా రాష్ట్రంలో ఉన్న అనేక సమస్యలను గాలికొదిలేసి మూసీ ప్రక్షాళన అంటూ ప్రజల దృష్టిని మరల్చేందుకు పాలకులు విఫలయత్నం చేస్తున్నారు.రాజ్యాంగాన్ని పరిరక్షించాలంటూ కాం గ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఊరూరా ఉపన్యాసాలు ఇస్తుంటే.. తెలంగాణలో మాత్రం ఆ పార్టీకే చెందిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడమే కాకుం డా ఏకంగా ఫిరాయింపు ఎమ్మెల్యేకు బీఏసీ చైర్మన్ పదవి కట్టబెట్టడం పరాకాష్ఠ. హుందా గా వ్యవహరించాల్సిన ముఖ్యమంత్రి తిట్ల దండకం అందుకోవడం, నోటికి ఏదొస్తే అది మాట్లాడటం, తీవ్ర పదజాలంతో ప్రతిపక్ష నేతలను దూషించడం చూస్తుంటే ఆయనలోని అసహనం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. సీఎం బాటలోనే నడుస్తున్న మంత్రు లు సైతం తప్పుడు కూతలు కూస్తూ న్యాయస్థానాల చేత మొట్టికాయలు వేయించుకుంటున్నారు. కక్షసాధింపే లక్ష్యంగా సాగుతున్న కాంగ్రెస్ పాలన ఎప్పుడో గాడితప్పింది.అదే సమయంలో ప్రతిపక్ష బీఆర్‌ఎస్ ఎం తో హుందాగా వ్యవహరిస్తున్నది. దూకుడు ప్రదర్శిస్తూనే అధికార పార్టీ తప్పిదాలను ఎత్తిచూపుతున్నది. అందుకే ఏడాది తిరగకుండానే ప్రజలు మళ్లీ బీఆర్‌ఎస్ వైపు చూస్తున్నారు. కేసీఆర్‌ను తలుచుకుంటున్నారు. సంక్షేమ సారథి మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షిస్తున్నారు. రాష్ట్రంలో రైతుల పక్షాన బీఆర్‌ఎస్ చేస్తున్న పోరాటాలకు వస్తున్న మద్దతే అందుకు నిదర్శనం. బీఆర్‌ఎస్‌కు ప్రజల్లో దక్కుతున్న ఆదరణను చూసి ఓర్వలేకపోతున్న కాంగ్రెస్ ప్రతిపక్షం గొంతునొక్కాలని చూస్తున్నది. ఈ దేశంలో అతి తక్కువ కాలంలో అపఖ్యాతి మూటగట్టుకున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్సే. ప్రజల దృష్టి మరల్చడం కోసం రేవంత్ సర్కార్ తీసుకొచ్చిన మూసీ సుందరీకరణ, హైడ్రా పాచికలు పారకపోగా మరింత ప్రజాగ్రహానికి గురయ్యాయి. ఈ నేపథ్యంలోనే కేసీఆర్ సర్కార్‌ను చేజేతులా పోగొట్టుకున్నామని ప్రజలు మథనపడుతున్నారు. ఊరూరా రచ్చబండల వద్ద కేసీఆర్ పాలన గురించే చర్చ జరుగుతున్నది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

# పర్యావరణ హితం పట్టని పాలకులు

న్యూఢిల్లీ,పర్యావరణ పరిరక్షణ అన్నది కేవలం నినాదంగా మారింది. ఢిల్లీ విషయమే తీసుకుంటే వాతావరణ కాలుష్యం అరికట్టే చర్యలు కానరావడం లేదు. కోర్టులు మొత్తుకుంటున్నా పట్టింపు లేదు. కాలుష్యం కారణంగా తాను వాకింగ్‌కు కూడా వెళ్లలేక పోతున్నానని సుప్రీం చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ చేసిన వ్యాఖ్యలు గమనార్హం. ఎంతగాపరిస్థితి దిగజారిందో గుర్తించాలి.ఢిల్లీ కాలుష్యపరిస్థితిలో మార్పు కానరావడం లేదు. గాలి నాణ్యత పడిపోతున్నా పట్టించుకోవడం లేదు. పంట వ్యర్థాలను కాల్చకుండా కూడా అరికట్టడం లేదు. మానవాళికి చెట్లు చేసే మేలేమిటో తెలుసుకోవడానికి ఎవరూ గూగుల్‌ను ఆశ్రయించనవసరం లేదు. పర్యావరణవేత్తలు చెబితే తప్ప తెలియని వారెవరూ లేరు. చెట్ల ఉపయోగాల గురించి బడి చదువుల దగ్గరనుంచి గురువులు నూరిపోయడవే ఇందుకు కారణం. దురదృష్టమేమంటే అధికార పీఠాలపై ఉన్న నేతలు, ఉన్నతాధికార వర్గంలో పనిచేస్తున్నవారు ఏ బళ్లో చదువుకుని ఆ స్థాయికి ఎదిగారోగానీ... దేశంలో ’అభివృద్ధి’ పేరు చెప్పి వృక్ష సంహారం జరగని రోజంటూ దేశంలో ఉండటం లేదు. చెట్లను కాపాడటానికి పర్యావరణ ఉద్యమకారులు చేయని పోరాటమంటూ లేదు. ప్రాణవాయువును అందిస్తున్న వృక్షజాలాన్ని ధ్వంసం చేయాలా అని ప్రశ్నిస్తున్నారు. విభిన్న జాతుల పక్షుల్ని వీక్షించడానికి, తమ కెమెరాల్లో బంధించడానికి విహంగ ప్రేమికులు నిత్యం ప్రకృతి ఒడిలోకి వస్తారు. ప్రశాంతంగా స్వచ్ఛమైన వాయువు పీల్చి పునీతులు కావడానికి నగర వాసుల్లో అత్యధికులు ఎన్నుకునే పార్కులు, చెట్టు ఉన్నచోటే. ఇది లోపించడం వల్ల ఇటీవల ఢిల్లీ కాలుష్యం పీల్చలేనంతగా తయారయ్యింది. చెట్లనుంచి వీచే గాలిని ఆస్వాదిస్తూ వందలమంది సైక్లింగ్, జాగింగ్ చేస్తుంటారు. పాలకుల తీరు కారణంగా, నగాల వ్యాప్తి కారణంగా ముంబైతో సహా మన మహానగరాలు కాంక్రీట్ జంగిల్స్‌గా మారుతున్నాయి. ఉపాధి దొరుకు తుందని పల్లెలు వీడి వస్తున్న వారితో పట్టణీకరణ పెరుగుతోంది. ప్లాస్టిక్ విపరీతంగగా వాడకం పెరరిగి అనేకం కాలుష్య కారకాలుగా తయారయ్యాయి. ప్రపంచంలో అత్యంత కాలుష్యభరిత నగరాలు 20 ఉంటే అందులో 15 మన నగరాలే. తీవ్ర ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న ప్రపంచంలోని 15 నగరాల్లో మన వాటా 11. ఈ నగరాల వాతావరణంలో, ఇక్కడి తాగునీటిలో మృత్యువు దాగుందని నిపుణులు చాన్నాళ్లుగా చెబుతున్నారు. నగర పౌరుల ఊపిరితిత్తుల్లోకి కొంచెం కొంచెంగా చొరబడుతున్న కాలుష్యం వారిని రోగగ్రస్తులుగా మారుస్తోంది. కేన్సర్, గుండె జబ్బులు వగైరాలకు కారణమవుతోంది. అనేకుల్లో అకాల వృద్ధాప్యాన్ని కలిగిస్తోంది. వారిని పనిపాటలకు దూరం చేస్తోంది. ఇదంతా మన పాలకులకు ఆందోళన కలిగించాలి. దీన్ని సరిచేయడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించడానికి పురిగొల్పాలి. కాలనీలో చెట్లు పెంచాలి. ఉన్న చెట్లను తొలగించకతప్పదను కుంటే ఆ చెట్లను మరొకచోట పాతడానికి ప్రయత్నించాలి. ప్రపంచ అధ్యయన సంస్థలు చెబుతున్న వాస్తవాలను అమలు చేయాలి. ఇల్లు కట్టుకుందా మనో, ఉన్న ఇంటిని విస్తరించుకుందామనో ఎవరైనా తమ ఆవరణలో చెట్లు కొట్టాలంటే అందుకు అనుమతులు తీసుకోవడం అవసరం. కానీ తమకు అలాంటి నిబంధనలు వర్తించవన్నట్టు అధికార యంత్రాంగాలు ప్రవర్తిస్తున్నాయి. పాలకులే ఇలా చట్టాల్ని ధిక్కరించే స్థితికి దిగజారడం కారణంగా దేశంలో పర్యావరణం దెబ్బతింటోంది. ఇప్పటికైనా పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి.

# అసమానతల భారతం

న్యూఢిల్లీ,మన దేశ వృద్ధి అంతంతమాత్రంగానే ఉండి, ఆదాయ అసమానతలకు దారితీయడానికి ఒక కారణం ఉంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నాణ్యమైన విద్య, ఆరోగ్యంపై తక్కువ పెట్టుబడులు పెట్టడమే ఆదాయ అసమానతలకు ప్రధాన కారణమని నోబెల్ పురస్కార గ్రహీత అమర్త్యసేన్ గతంలో పేర్కొన్నారు. తద్వారా అధిక ఆదాయ వర్గాల్లోని విద్యావంతులు, ఆరోగ్యవంతులు వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ నుంచి డబ్బు సంపాదించేందుకు ఎక్కువ అవకాశాలను పొందారు. అదే సమయంలో అత్యల్ప ఆదాయ వర్గాల్లోని నిరక్షరాస్యులైన కార్మికులు ఇప్పటికీ రోజువారీ అవసరాలను తీర్చుకునేందుకే కష్టపడుతున్నారు.ప్రపంచ అసమానతల నివేదిక- 2022 ప్రకారం.. ప్రపంచంలో అత్యధిక ఆదాయ అసమానతలు కలిగిన దేశాల్లో భారత్ కూడా ఒకటి. దేశ వృద్ధిని గొప్పగా ప్రచారం చేస్తున్న మీడియాలోని ఒక వర్గం అంతర్గత సమస్యలను కప్పిపుచ్చుతున్నది. విదేశాలకు వెళ్లే భారతీయుల సంఖ్య గణనీయంగా పెరిగినట్టు ఇటీవల ఒక వార్త హల్‌చల్ చేసింది. ప్రజల ఆదాయం పెరిగినట్టు దీని ద్వారా పైకి తెలుస్తున్నప్పటికీ.. అసలు వాస్తవం వేరే ఉన్నది. 140 కోట్లకు పైగా జనాభా ఉన్న దేశంలో లక్షల మంది విమాన ప్రయాణం చేసినంత మాత్రాన ఆదాయం పెరిగినట్టు కాదు. అమెరికాలో ఆదాయ అసమానతలు భారీగా ఉన్నప్పటికీ, ఆ దేశ ప్రజలు కూడా విమానయానం ఎక్కువగానే చేస్తున్నారు. ఇంకా చెప్పాలంటే.. విదేశాలకు వెళ్లేవారి సంఖ్య పెరిగినంత మాత్రాన దేశంలో అసమానతలు తగ్గి, ఆదాయ పంపిణీ మెరుగైనట్టు కాదు.గృహ సర్వేల ఆధారంగా అసమానతలను పలు సర్వే సంస్థలు అంచనా వేస్తాయి. అయితే, ఇవన్నీ స్వీయ ప్రకటిత ఆదాయాలపై ఆధారపడి చేసిన సర్వేలే. విదేశాల నుంచి లభించే ఆదాయాలు లేదా నల్లధనం ఈ నివేదికలకు చిక్కవు. అందుకే, నివేదికల్లో పేర్కొన్న దానికంటే మరింత ఎక్కువగా వాస్తవ అసమానత ఉంటుంది. ఆదాయపు పన్ను శాఖ, ఈడీల చేతికి చిక్కకుండా ఉండేందుకు ధనవంతులు నల్లధనాన్ని ఎక్కువగా విదేశాల్లో దాచిపెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. షెల్ కంపెనీలు, అనామక ట్రస్టుల ద్వారా నిధులు మళ్లిస్తూ కేంద్ర దర్యాప్తు సంస్థల నుంచి తప్పించుకుంటున్నారు. విదేశాల్లో నల్లధనం దాచిన చాలామంది భారతీయుల వివరాలను 2013లో పనామా పేపర్స్ బహిర్గతం చేశాయి. వాషింగ్టన్ డీసీకి చెందిన గ్లోబల్ ఫైనాన్షియల్ ఇంటిగ్రిటీ (జీఎఫ్ఐ) నివేదిక ప్రకారం.. 1948-2008 మధ్యకాలంలో 213.2 బిలియన్ డాలర్ల నల్లధనం మన దేశం నుంచి తరలిపోయింది. అయితే, సరైన ఆధారాలు లేకపోవడం, అంతర్జాతీయంగా ఉండే సంక్లిష్టతల కారణంగా వారిపై చర్యలు తీసుకోవడానికి వీల్లేకుండాపోయింది.సాధారణంగా ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందితే.. అది పన్నులు, ఇతర మార్గాల ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాలి. ఉదాహరణకు వ్యాపారాలు వృద్ధి చెంది కంపెనీలకు ఎక్కువ లాభాలు వస్తే.. కార్పొరేట్ పన్ను పెరుగుతుంది. ఉపాధి పెరగడం ద్వారా ఆదాయ పన్ను పెరుగుతుంది. ప్రజలు ఎక్కువగా ఖర్చు చేయడం మూలంగా జీఎస్టీ వసూళ్లు పెరుగుతాయి. కానీ, వేగవంతమైన ఈ వృద్ధి సంఘటిత రంగంలో ఉద్యోగాలను సృష్టించడం లేదు. అందువల్ల ఎక్కువమంది అసంఘటిత రంగంలో పని చేస్తూ పొట్ట పోసుకోవాల్సి వస్తున్నది. దీనివల్ల ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందినప్పటికీ ప్రజల ఆదాయం మాత్రం మందగిస్తున్నది. అంతేకాదు, తత్ఫలితంగా జీడీపీ కూడా తగ్గుముఖం పడుతున్నది. అందరి భారం తామే ఎందుకు మోయాలనే ఉద్దేశంతో చాలామంది పన్నులను ఎగవేసేందుకు దారులు వెతుకుతున్నారు.సంపద, ఆదాయ పంపిణీలో



తీవ్రమైన అసమానతలు ఎక్కువగా ఉన్న దేశాల్లో ప్రజాస్వామ్యం వెనుకబాటుతనానికి గురయ్యే ప్రమాదం పొంచి ఉంటుంది. 2014లో దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటినుంచీ పెరుగుతున్న ఆదాయ అసమానతలు, ప్రజాస్వామ్య వెనుకబాటుతనానికి మధ్య స్పష్టమైన సంబంధం ఉంది. ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలు, సబ్సిడీలు ప్రజల మధ్య ఉన్న ఆదాయ అసమానతలను తగ్గించడంలో విఫలమయ్యాయనే చెప్పాలి. అంతేకాదు, ఇవి ఇటీవలి పార్లమెంట్ ఎన్నికల్లో మోదీకి మద్దతును కూడగట్టడంలోనూ విఫలమయ్యాయి. అందుకే బీజేపీ సీట్ల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఈ నేపథ్యంలో ఆదాయ అసమానతలు లేని, సంపద పంపిణీ అందరికీ సమానంగా జరిగే ఆర్థిక వృద్ధిపై ప్రభుత్వాలు దృష్టిసారించాల్సిన అవసరమున్నది.

# టీడీపీపై మండిపడ్డ వైసీపీ

అమరావతి, వైఎస్ కుటుంబంలో ఆస్తి తగాదాలు ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టిస్తున్నాయి. ఈ వివాదంపై తన అన్న జగన్, వదిన భారతిని తీవ్ర విమర్శలు చేస్తూ వైఎస్ అభిమానులకు షర్మిల నిన్న ఒక లేఖను రాశారు. అయితే జగన్ కుటుంబంలో నెలకొన్న కుటుంబ తగాదాలను టీడీపీ రాజకీయంగా వాడుకోవడం మొదలుపెట్టింది. షర్మిల లేఖలోని ముఖ్యమైన పాయింట్లను స్క్రీన్‌షాట్స్ తీసుకుని మరీ ట్విట్టర్ (ఎక్స్) ఖాతాలో షేర్ చేసింది. అయితే దీనిపై వైసీపీ మండిపడింది. వైఎస్ కుటుంబ తగాదాలపై టీడీపీకి ఎందుకంత ఆసక్తి అని ప్రశ్నించింది. షర్మిల రాసిన లేఖను టీడీపీ తన అధికారిక ట్విట్టర్ (ఎక్స్) హ్యాండిల్‌లో బిగ్ బ్లాస్ట్ అంటూ పోస్టు చేసి ఈ గొడవను రెచ్చగొట్టి, నాణేనికి ఒకవైపే చూపించి ప్రజలను పక్కదోవ పట్టించడం వెనుక అసలు ఉద్దేశమేంటి అని వైసీపీ నిలదీసింది. దీన్ని ఆసరాగా చేసుకుని వ్యక్తిత్వ హననానికి దిగాలనే లక్ష్యం కాదాంటారా అని ప్రశ్నించింది. ఇచ్చిన హామీలను అమలు చేయలేక ఘోరమైన పాలనా వైఫల్యం నుంచి ఆగ్రహంతో ఉన్న ప్రజల దృష్టిని మళ్లించడానికి చేస్తున్న డైవర్షన్ పాలిటిక్స్ కాదా అని ప్రశ్నించింది. దిగజారుతున్న లా అండ్ ఆర్డర్‌తో కడతేరుతున్న ఆడబిడ్డలపై జరుగుతున్న దారుణాల నుంచి, డయేరియా మరణాల నుంచి ప్రజలను తప్పుదోవ పట్టించడానికే ఈ తప్పుడు రాజకీయాలు కాదా అని మండిపడింది. రాజకీయంగా వైఎస్ జగన్ అంతాన్ని కోరుకుంటున్న వారితో తన వంతు పాత్ర పోషిస్తున్న ఘట్టం నేపథ్యంలో, ప్రజలకు అన్ని వాస్తవాలు తెలిసేలా వైఎస్ జగన్ తన సోదరికి రాసిన అన్ని లేఖలను, తన స్వార్జిత ఆస్తుల్లో ఇవ్వదలుచుకున్న ఆస్తుల వివరాలతో కూడిన ను కూడా

# చౌక బియ్యంతో వ్యాపారం చేస్తున్న దళారులు

నిజామాబాద్,చౌక బియ్యాన్ని తినడానికన్నా అమ్ముకోవడానికే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఇది కొందరికి వనరుగా, మరికొందరికి ఆదాయ వనరుగా మారింది. ఈ బియ్యంతో హోటళ్లలో టిఫిన్లు తయారవుతున్నాయి. అలాగే సరిహద్దులు దాటి సన్నబియ్యంగా మారుతున్నాయి. ఈ విషయాలన్నీ ప్రజందరికీ తెలుసు. రాజకీయ నాయకులు కూడా తెలుసు. కానీ ఎవరు కూడా దీనిపై చర్చించడం లేదు. ఎక్కడా ప్రస్తావించడం లేదు. తమకెందుకులే అన్న నిర్లిప్తతతే ఇప్పుడు ప్రభుత్వానికి గుదిబండగా మారింది. నిరుపేదల కడుపు నింపడానికి పంపిణీ చేయాల్సిన రాయితీ బియ్యం యథేచ్ఛగా నల్ల బజారుకు తరలి అక్రమార్కుల పరం అవుతోంది. కిలో రూపాయికి బియ్యం ఇవ్వడం వల్ల రాయితీ బియ్యం అక్రమ రవాణాను కొందరు వృత్తిగా మార్చుకున్నారు. తెలంగాణ జిల్లాలకు మహారాష్ట్ర అతి సమీపంలో ఉండటం, అక్కడ బియ్యం ధర అధికంగా ఉండటంతో పేదల ఆకలి తీర్చాల్సిన రాయితీ బియ్యాన్ని అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. రైళ్లలో అక్రమ రవాణా జరుగుతున్నా, బియ్యాన్ని పోలీసులు పట్టుకోవడం నిత్యం జరుగుతున్నా అవకతవకలకు అడ్డుకట్ట పడడం లేదు. దీనిపై సమీక్షించి కఠినంగా వ్యవహరించడంతో పాటు కిలో రూపాయిని కనీసం ఐదు రూపాయలకు పెంచాల్సిన అవసరం ఉంది. దీనిని కూడా గుర్తించడం లేదు. ధరలు పెంచితే ఎక్కడ ఓట్లు గల్లంతవుతాయో అన్న భయం పాలకులను వెన్నాడుతున్నట్లుగా ఉంది. ఈ మొత్తాన్ని రైతులకు మద్దతు ధరలకు కేటాయిస్తే మరీ మంచిది. వేలకోట్లు దండగమారి పథకానికి ఖర్చు చేస్తున్నారు. ధాన్యం కొనండని రైతులు చేస్తున్న ఆందోళనలను గుర్తించి వారికి అండగా నిలవాలి. కిలోబియ్యం పథకం దుబారాను తగ్గించి వాటిని ధాన్యం కొనుగోళ్లకు వెచ్చించాలి. కార్డులు తగ్గించడం కన్నా అక్రమాలపై దృష్టి పెట్టడం లేదు. పేదలకు బియ్యం అందించాలన్న సదుద్దేశ్యాన్ని ఎవరూ కాదనలేరు. కానీ రూపాయికే ఇవ్వాలనుకోవడం, అలా ఇచ్చిన బియ్యం అక్రమంగా తరలకుండా కఠినంగా చర్య తీసుకోకపోవమే ఆక్షేపణీయం. ఇప్పటికైనా ఈ అక్రమాలను గుర్తిస్తే ఖజానాపై భారం తప్పుతుంది.

# ట్రాన్స్‌కోకు గుదిబండగా విద్యుత్ బకాయిలు

హైదరాబాద్,మున్సిపల్ పరిధిలో విద్యుత్ బకాయలు చెల్లింపు జరక్క అధికారులు తలలు పట్టుకుంటున్నారు. దీంతో డిస్కంలకు రుణభారం పెరుగుతోంది. కొన్ని మునిసిపాలిటీలుగా మారాక కరెంట్ బిల్లు బకాయిపడితే మరికొన్ని గ్రామపంచాయతీల ఆదాయం లేక బకాయిలను మూటగట్టుకున్నాయి. వీధి దీపాలు, నీటి సరఫరాకు సంబంధించి విద్యుత్‌ను వాడుకుంటున్నా బిల్లులు చెల్లించడం లేదు. బిల్లుల చెల్లింపు విషయంలో మునిసిపాలిటీలు వ్యవహరిస్తున్న తీరు విద్యుత్ శాఖకు ఇబ్బందికరంగా మారిందని అధికారులు వాపోతున్నారు. దీంతోవిద్యుత్ బకాయిల చెల్లింపులో మునిసిపాలిటీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. మున్సిపాలిటీలు ట్రాన్స్‌కోకు చెల్లించాల్సిన బకాయిలు కోట్లలోపేరుకుపోయాయని సమాచారం. కొన్ని మునిసిపాలిటీలు ఏళ్ల తరబడి బిల్లులు చెల్లించకపోవడం విద్యుత్ శాఖకు భారంగా మారింది. వాటికి ప్రభుత్వ పరంగా ప్రత్యేక నిధులు రావడం లేదు. దాంతో కార్యాలయాలకు కరెంట్ కట్ కాకుండా చూసుకుంటున్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాటు చేయాలి

అమరావతి, రాజమహేంద్రవరం: ఆంధ్రప్రదేశ్‌లో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఏపీ జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. నవంబర్ 6వ తేదీ లోగా ఓటర్ల నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కూటమి శ్రేణులకు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ..”ఈసారి రాష్ట్రవ్యాప్తంగా 70 నియోజకవర్గాల పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతాయి. ఎన్డీయే అభ్యర్థులను గెలిపించేందుకు కూటమి శ్రేణులు కృషి చేయాలి. ప్రభుత్వం అందించే కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలి. పార్టీ నేతలంతా కార్యకర్తలను సమన్వయం చేస్తూ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలి. సాగునీటి సంఘాల ఎన్నికల్లోనూ మనదే విజయం కావాలి. ఇందుకు ప్రతి ఒక్కరూ నిర్లక్ష్యం వహించకుండా క్షేత్రస్థాయిలో పని చేయాలి. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో కష్టపడినట్లే ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ చెమట చిందించాలి. ఏపీలో ఉచిత ఇసుక సరఫరా చేయాలని అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం. పదకొండు బోట్స్‌మెన్ సొసైటీల్లో పూర్తిస్థాయిలో ఇసుక అందుబాటులోకి తీసుకువస్తాం. ఉచిత ఇసుక పంపిణీలో స్థానిక నేతలెవరూ జోక్యం చేసుకోవద్దు. ఇసుక సరఫరాలో అక్రమాలకు పాల్పడే నేతలపై కఠిన చర్యలు ఉంటాయని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. వైసీపీ పాలనలో ఆ పార్టీ నేతలు కమిషన్ల కోసం కక్కుర్తి పడ్డారు. విద్యుత్‌ను అధిక రేట్లకు కొనుగోలు చేసి ప్రజలపై భారం మోపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు టీడీపీ కార్యకర్తలకు అండగా నిలబడ్డారు. వారి శ్రేయస్సు కోసం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కేవలం రూ.100 కడితే రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకూ ప్రమాద బీమా అందిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని సైతం విజయవంతం చేయాలి. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కువ మందితో సభ్యత్వం చేయించే దిశగా కష్టపడాలి” అని చెప్పారు.

# అమెరికాకు చేరుకున్న నారాలోకేశ్

న్యూఢిల్లీ,పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కో నగరానికి చేరుకున్న రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్‌కు ఎయిర్‌పోర్టులో ఐటీ సర్వ్, ఎన్ఆర్ఐ టీడీపీ ప్రతినిధులు అపూర్వ స్వాగతం పలికారు. ఏపీలో ఎన్డీఏ కూటమి “అఖండ” విజయం సాధించిన తర్వాత తొలిసారిగా అమెరికాలో లోకేష్ పర్యటిస్తున్నారు. అక్టోబర్ 25 నుంచి నవంబర్ 1వ తేదీ వరకు మంత్రి లోకేష్ అమెరికా పర్యటన సాగనుంది. ఈనెల 29న లాస్ వేగాస్ నగరంలో జరుగనున్న ఐటీ సర్వీస్ సినర్జీ 9వ సదస్సుకు మంత్రి హాజరుకానున్నారు. 31న అట్లాంటాలో ఎన్టీఆర్ ట్రస్ట్ ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో లోకేష్ పాల్గొననున్నారు. శాన్ ఫ్రాన్సిస్కోలో పారిశ్రామికవేత్తలతో మంత్రి లోకేష్ సమావేశమయ్యారు. వై2కె బూమ్ నేపథ్యంలో హైదరాబాద్, బెంగుళూరు నగరాల్లో ఐటీ శరవేగంగా అభివృద్ధి చెందిందని, ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న ఏఐ అవకాశాలను అందిపుచ్చుకోవడం ద్వారా ఆంధ్రప్రదేశ్ శరవేగంగా అభివృద్ధి సాధించబోతోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు గల అనుకూలతలు, ప్రభుత్వం అమలు చేస్తున్న ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలను మంత్రి వివరించారు. భారత్‌లో రాబోయే పాతికేళ్లలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకోబోతున్నాయని , పరిపాలనలో ఏఐ వినియోగం ద్వారా ప్రజలకు వేగవంతమైన, మెరుగైన సేవలను అందించేందుకు తాము కృషి చేస్తున్నామని తెలిపారు. నాలుగవ సారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు నేతృత్వంలో యువనాయకత్వం చురుగ్గా పనిచేస్తోందన్నారు. మంత్రివర్గంలో 17 మంది కొత్తవారే ఉన్నారని.. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో మ్యాన్యుఫ్యాక్చరింగ్, రెన్యువబుల్ ఎనర్జీ, బయో ఎనర్జీ, ఆక్వా, పెట్రో కెమికల్ రంగాల్లో పెట్టుబడులకు విస్తృతమైన అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి ద్వారా పేదరిక నిర్మూలనకు సీఎం సరికొత్త పీ-4 విధానానికి శ్రీకారం చుట్టారని మంత్రి తెలిపారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యావ్యవస్థలో మార్పులు తీసువస్తామన్నారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యతతో కూడిన మానవవనరులను అందించడానికి, తద్వారా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు విద్యారంగంలో కూడా సంస్కరణలకు శ్రీకారం చుట్టామన్నారు. నవీన ఆవిష్కరణల కోసం విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలకు ప్రాధాన్యతనిస్తూ రీసెర్చి సెంట్రిక్‌గా చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

# 175 నియోజకవర్గాల్లో ఒకేసారి టీడీపీ సభ్యత్వాలు

అమరావతి,రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ఒకేసారి టీడీపీ సభ్యత్వ నమోదు కార్యమ్రాన్ని టీడీపీ అధినేత ప్రారంభించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పునః ప్రారంభించారు. సభ్యత్వ నమోదులో భాగంగా పార్టీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ రూ.100 కట్టి సీఎం చేతుల మీదుగా మ్నెదటి సభ్యత్వాన్ని తీసుకున్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని, కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉండాలని శుక్రవారం నాడు సీఎం చంద్రబాబు టీడీపీ శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ వందల, వేల మంది కార్యకర్తల కృషి ఫలితంగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి టీడీపీ పార్టీ సేవలు అందించగలుగుతుందని అన్నారు. ఆపద సమయంలో వారిని ఏ విధంగా ఆదుకుంటామో చేసి చూపిస్తామని సీఎం చెప్పారు. పార్టీ కోసం అనేక మంది కార్యకర్తలు, నేతలు వివిధ స్థాయిల్లో కష్టపడి పని చేశారని ఆయన చెప్పుకొచ్చారు. పార్టీ కోసం పోరాడి అనేక కేసులు పెట్టించుకున్నారని, జైలుకు వెళ్లారని, ఆస్తులు పోగొట్టుకున్నారని చంద్రబాబు తెలిపారు. అలాంటి వారికి కచ్చితంగా టీడీపీ పార్టీ అండగా నిలబడుతుందని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా లబ్ధిదారులైన పలువురు కార్యకర్తలతో ఆయన దృశ్య మాధ్యమం ద్వారా మాట్లాడారు. గతంలో ఇన్స్యూరెన్స్ రాని 73 మందికి రూ.2లక్షల చొప్పున చంద్రబాబు అందించారు. ఈ మేరకు నేడు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పునఃప్రారంభించారు. రూ.100లు కట్టి సభ్యత్వం తీసుకుంచే రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ ప్రమాద బీమా వర్తిస్తుంది. రూ.లక్ష కడితే పార్టీలో శాశ్వత సభ్యత్వం లభిస్తుంది. ప్రమాదవశాత్తూ చనిపోతే మట్టి ఖర్చుల కింద రూ.10 వేలు తక్షణసాయం అందజేస్తారు. అలాగే బాధిత కుటుంబ సభ్యులకు విద్య, వైద్యం, ఉపాధి కోసం ఆర్థికసాయం అందిస్తారు. మరోవైపు కర్నూలు జిల్లా టీడీపీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఏపీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ప్రారంభించారు.

# కాంగ్రెస్ వైఫల్యాలే పొరుగున ప్రచారాస్త్రాలు



హైదరాబాద్,కాంగ్రెస్ శాసనమండలి సభ్యుడు టి.జీవన్‌రెడ్డి తన అనుచరుడు గంగారెడ్డి హత్యపై ఇటీవల తీవ్రంగా స్పందించారు. రోడ్డుపై బైఠాయించి నిరసన కూడా తెలిపారు. ‘రాష్ట్రంలో అసలు శాంతిభద్రతలు ఉన్నాయా?’ అని ఆయన సొంత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తోటి కాంగ్రెస్ నాయకులు ఓదార్చడానికి రాగా మీడియా సమక్షంలోనే.. ‘మీరూ, మీ పార్టీ చాలు. ఇప్పటి వరకు చాలా ఓర్చుకున్నాను. ఇక చాలు, కాంగ్రెస్ పాలనలోనే కాంగ్రెస్ వారికి భద్రత లేకుండాపోయింది’ అని జీవన్‌రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్‌లో చేరిన ప్రజాప్రతినిధుల శాసన సభ్యత్వం రద్దు చేయాలని ఆ మరుసటి రోజే ఆయన డిమాండ్ చేశారు. ఇదంతా గంగారెడ్డి హత్యపై అప్పటికప్పుడు జీవన్‌రెడ్డి నుంచి వచ్చిన స్పందనగా చూడలేం. జీవన్‌రెడ్డిలోనే కాదు, చాలామంది కాంగ్రెస్ నాయకుల్లో అసంతృప్తి ఉంది. అయితే, రేవంత్‌రెడ్డిపై అధిష్ఠానానికి నమ్మకం ఉన్నంతవరకు వారు వీర కాంగ్రెస్ వాదులుగానే ఉంటారు. ఒక్కసారి అధిష్ఠానం వద్ద రేవంత్‌రెడ్డి పలుకుబడి తగ్గితే వారు తమ విశ్వరూపం చూపిస్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది కూడా కాలేదు. ఇప్పటివరకు ఒక్కసారి కూడా మంత్రివర్గ విస్తరణ జరగలేదు. అసంతృప్తి ఉన్నా విస్తరణలో అవకాశం దక్కుతుందేమోననే ఆశలుండటంతోనే కొంతమంది మిన్నకుండిపోతున్నారు. కాంగ్రెస్ సీనియర్ల పరిస్థితి మింగలేక కక్కలేక అన్నట్టుగా ఉంది. పదేండ్లు విపక్షంలో ఉండి నానా తంటాలు పడి పార్టీని బతికించుకుంటే చివరి నిమిషంలో వచ్చి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పీఠాన్ని కొట్టేశారనే బాధ వారిలో స్పష్టంగా కనిపిస్తున్నది. దేశవ్యాప్తంగా ఎన్నికల వ్యయం విషయంలో కాంగ్రెస్‌ను ఆదుకునే బలమైన రాష్ట్రాలు రెండే రెండు. ఒకటి కర్ణాటక, రెండవది తెలంగాణ. కర్ణాటక సర్కార్ ఇప్పటికే కుంభకోణాల్లో ఇరుక్కుంది. దాంతో తెలంగాణను మరింత జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ అధిష్ఠానంపై ఉంది. ఇది రేవంత్‌రెడ్డికి కలిసొచ్చే అంశం. దీంతో సీనియర్లు తమలో తామే కుమిలిపోతూ అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. ఎన్టీఆర్ జమానాలో రాజకీయాల్లోకి వచ్చి అలుపెరగని పోరాటం చేస్తున్న జీవన్‌రెడ్డికి కాలం కలిసిరావడం లేదు. పదేండ్ల పోరాటం తర్వాత రేవంత్‌రెడ్డి రూపంలో జీవన్‌రెడ్డిని దురదృష్టం వెంటాడుతోంది. రేవంత్‌రెడ్డి హయాంలో జీవన్‌రెడ్డికి ఎలాంటి గుర్తింపు దక్కడం లేదు. పైగా ఇంట్లోనే పొగ పెట్టినట్టు జగిత్యాల నుంచి గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. అతన్ని పార్టీలో చేర్చుకోవడంపై జీవన్ రెడ్డి మొదటినుంచీ బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అతన్ని కాంగ్రెస్ హై కమాండ్ ఢిల్లీకి పిలిపించి ఏదో సర్దిచెప్పి పంపించేసింది. కొద్ది రోజులు మౌనంగా ఉన్న జీవన్‌రెడ్డి అనుచరుడు గంగారెడ్డి హత్య నేపథ్యంలో తన అసంతృప్తిని మరోసారి బయటపెట్టారు. మిగిలిన సీనియర్లు అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. ‘నన్నోడి తానోడేనా? తానోడి నన్నోడెనా?’ అని జూదంలో తనను పందెం కాసి ధర్మరాజు ఓడిపోయినప్పుడు ద్రౌపది ప్రశ్నించినట్టు.. ఫిరాయింపుదారుల గురించి జీవన్‌రెడ్డి ఆసక్తికరమైన ప్రశ్నలు సంధించారు. బీజేపీని దేశవ్యాప్తంగా ఏ అంశం గురించైనా కాంగ్రెస్ విమర్శిస్తే.. తెలంగాణలో హస్తం పార్టీ పాలనను ఉదహరిస్తూ మోదీ ఎదురుదాడి చేస్తున్నారు. ఇక్కడి ప్రభుత్వ వైఫల్యాలను దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తున్నారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా తెలంగాణలో కాంగ్రెస్ పాలన గురిం చి మోదీ ప్రస్తావిస్తున్నారు. దాన్ని ఒక ఆయుధంగా వాడుకుంటున్నారు. ‘అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను కేసీఆర్ చేర్చుకున్నారు కాబట్టి, మనం చేర్చుకున్నాం’ అని చెప్తున్నవారిని ఆయన ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేశారు. ‘కాంగ్రెస్ పార్టీ కేసీఆర్‌ను అనుసరించాలా? లేక సోనియాగాంధీ, రాహుల్‌గాంధీని అనుసరించాలా? కేసీఆర్ మన నాయకుడా? లేక సోనియాగాంధీ, రాహుల్‌గాంధీనా? అంటూ కాంగ్రెస్‌ను కడిగిపారేశారు. పార్టీ ఫిరాయించిన నేతల సభ్యత్వం రద్దు చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తుంటే.. రాష్ట్రంలో మాత్రం పార్టీ మారిన వారిని ఎలా సమర్థిస్తారని నిలదీశారు. రేవంత్ రెడ్డికి హై కమాండ్ అండ తప్ప రాష్ట్ర కాంగ్రెస్ నాయకుల మద్దతు లేదనే చెప్పాలి. మూసీ వ్యవహారంలో ఇన్ని విమర్శలు వస్తుంటే కనీసం నల్లగొండ జిల్లా నాయకులైనా స్పందించరా? అని రేవంత్ ఆవేదన వ్యక్తం చేయాల్సి వచ్చిందంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఆయన ఆవేదన వ్యక్తం చేసిన తర్వాత ఇంకా కాంగ్రెస్‌లో చేరని గుత్తా సుఖేందర్‌రెడ్డి స్పందించారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే గాంధీ తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఇంటిపైకి దాడికి వెళ్లినా, ఎవరేం చేసినా ఎవరినీ ఏమీ అనలేని పరిస్థితి రేవంత్ రెడ్డిది. మాజీ మంత్రి కేటీఆర్‌ను, సినీ నటుడు నాగార్జున కుటుంబాన్ని మంత్రి కొండా సురేఖ అసభ్యకరంగా దూషించి పార్టీ పరువు తీసినా మందలించలేని పరిస్థితి. అవేం మాటలని మంత్రిని న్యాయస్థానం తప్పుపట్టినా తనకు సంబంధం లేని విషయం అన్నట్టుగానే సీఎం మౌనంగా ఉండిపోయారు. తన అనుచరులను అరెస్ట్ చేశారని ఓ మంత్రి వెళ్లి సీఐ కుర్చీలో కూర్చున్నా మందలించలేని దుస్థితి. ఒకవేళ ఏదైనా ఉంటే హై కమాండ్ అడగాల్సిందే తప్ప రేవంత్ రెడ్డి అడిగే పరిస్థితి లేదు. పార్టీలో అందరూ రేవంత్ రెడ్డి కన్నా సీనియర్లే కావడం అందుకు ప్రధాన కారణం. అవకాశం ఉన్న చోట గతంలో టీడీపీలో తనతో పాటు పనిచేసిన వారికి రేవంత్‌రెడ్డి అవకాశం కల్పిస్తున్నారు. మొదటినుంచి కాంగ్రెస్‌లో ఉన్న వారికంటే టీడీపీ నుంచి వచ్చినవారికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు జీవన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఒక్క తెలంగాణలో పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ కాంగ్రెస్ తెగ మురిసిపోతోంది. కానీ, రాత్రికి రాత్రి రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీని అధికార పీఠం పై నుంచి దించి తమ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో సిద్ధహస్తుడైన మోదీ దేశాన్ని పాలిస్తున్నారనే విషయాన్ని కాంగ్రెస్ గ్రహించడం లేదు. ఇక తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ పట్ల బీజేపీ అంత సీరియస్‌గా ఏమీ లేదు. బీజేపీ, కాంగ్రెస్‌ల ఉమ్మడి శత్రువు బీఆర్ఎస్ అన్నట్టుగానే ఆ రెండు పార్టీలు వ్యవహరిస్తున్నాయి. అందుకే కాంగ్రెస్ వైఫల్యాలపై బీజేపీ చూసీచూడనట్టుగా ఉంటున్నది. అయితే పార్టీ పరంగా తుది నిర్ణయాలు తీసుకునేది మోదీ అన్న సంగతిని మరువకూడదు. తెలంగాణ రాజకీయాలకు సంబంధించి మోదీ మదిలో ఏముందో వేచి చూడాలి. అప్పటి వరకు కాంగ్రెస్‌కు బీజేపీ నుంచి పెద్ద వ్యతిరేకత ఏమీ ఉండదు.

# ‘హగ్’లు సరే... ఆచరణ ఉంటుందా!

వాస్తవాధీన రేఖ (ఎల్ఏసి) వెంబడి ఉద్రిక్తతలను తొలగించడానికి, భారత్ చైనా దేశాలు దోస్తీతో గస్తీ సాగించడానికి ఒప్పందం కుదరడం రెండు దేశాల మధ్య తిరిగి మైత్రికి మొదటి అడుగు పడినట్టే. బ్రిక్స్ సదస్సులో ప్రధాని నరేంద్ర మోడీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ స్నేహపూర్వకంగా కలుసుకోవడం, ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకోవడం చూస్తే జిన్‌పింగ్ విధానాల్లో ఏదో మార్పు వచ్చినట్టు కనిపిస్తోంది. అయితే సరిహద్దు వివాదాలపై మరిన్ని చర్చలు జరగాలన్న అభిప్రాయం వీరి ప్రకటనల్లో వ్యక్తమైంది. వాస్తవాధీన రేఖ గస్తీ విషయంలో మాత్రమే ఒక ఒప్పందం కుదిరింది తప్ప మిగతా కీలకమైన అంశాల్లో ఎలాంటి విధానపరమైన నిర్ణయాలు వెలువడలేదు .సామ్రాజ్య విస్తరణ కోసం ‘రణ’ దాహంతో తపించే చైనా మాటల్లో ఎంతవరకు ఆచరణ ఉంటుందో నమ్మలేం. సరిహద్దు సమస్యకు పూర్తి పరిష్కారం కుదిరే వరకు వాస్తవాధీన రేఖను ఉభయ దేశాలు పరిరక్షించుకోవాలన్న ఒప్పందం ఇదివరకే ఉన్నప్పటికీ ఆ ఒప్పందాన్ని చైనా ఖాతరు చేయలేదన్నది చారిత్రక సత్యం. ఇప్పుడు అనేక కారణాల వల్ల భారత్‌కు స్నేహ హస్తాన్ని అందించడానికి ముందుకు వచ్చింది. చైనాలో ఆర్థిక పరిస్థితి మందగించడంతో పొరుగు దేశాలతో వాణిజ్య సంబంధాలను మెరుగుపర్చుకోవాలని చూస్తోంది. భారత్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూ. 102 లక్షల కోట్ల మూలధనంతో చేపట్టిన జాతీయ మౌలికసదుపాయాల పైప్‌లైన్ ప్రాజెక్టుకు చైనా నుంచి తగిన సహాయం లభిస్తుందని భారత్ ఆశిస్తోంది. పొరుగు దేశాల భాగస్వామ్యంతో ముడిపడి ఉన్న ఈ ప్రాజెక్టుకు చైనా నుంచి ఎంతవరకు సహకారం లభిస్తుందో చూడాలి. దేశంలో కీలకమైన ఎలక్ట్రిక్ వాహనాలు, సెమీకండక్టర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాలకు చైనా సహకారంతో ముడిపడి ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవలనే ప్రకటించారు. సరిహద్దు దేశాల పెట్టుబడులపై ఆంక్షలను కూడా సడలిస్తాని ఆమె పేర్కొన్నారు. ఈ పరిణామాల దిశగా మన దేశానికి చైనా నుంచి ఊతం ఇస్తుందన్న ఆశలు మొలకెత్తుతున్నాయి. చైనా పెట్టుబడులకు అడ్డంకులు, ఆంక్షలు తగ్గించినా, చైనా నుంచి మన దేశ పరిశ్రమలకు సాంకేతిక పరిజ్ఞానం అందడం లేదు. అయితే చైనా దిగుమతులపై ఎక్కువగా ఆధారపడే భారత్‌లోని టెలికమ్యూనికేషన్లు, ఎలక్ట్రానిక్స్, ఫార్మాస్యూటికల్స్, కెమికల్స్, ప్లాస్టిక్స్, సోలార్ ఎనర్జీ , ఆటోమొబైల్ వంటి ముఖ్యమైన పరిశ్రమలకు చైనాతో సంబంధాలు ఆసరా కల్పిస్తాయని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్టు ఆర్గనైజేషన్స్ అంచనా వేస్తోంది. ఉభయ దేశాల ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం అయితే అనిశ్చితి పరిస్థితులు తగ్గుతాయి. ముడివనరులు, విడిభాగాలు సజావుగా సరఫరా అవుతాయి. 202324లో చైనాతో భారత్ ద్వైపాక్షిక వాణిజ్యం 118.39 బిలియన్ డాలర్ల వరకు జరగ్గా, అందులో చైనా నుంచి రూ. 101.73 బిలియన్ డాలర్ల విలువైన దిగుమతులు జరిగాయి. అదే సమయంలో మన దేశం నుంచి చైనాకు కేవలం 16.66 బిలియన్ డాలర్ల ఎగుమతులు మాత్రమే జరగడం ఆలోచించవలసిన విషయం. ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడితే ఉత్పాదకతతో ముడిపడిన పెట్టుబడుల పథకం (పిఎల్ఐ)లో పెట్టుబడులు పెట్టడానికి చైనా సంస్థలు సిద్ధపడతాయి. ఫలితంగా స్థానికంగా వివిధ పరిశ్రమల అభివృద్ధి ప్రమాణాలకు తగ్గట్టు మన దేశంలోని ఎంఎస్ఎంఇ



(మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్) సంస్థలు, వాటి అనుబంధ పరిశ్రమల విస్తృత అభివృద్ధికి దోహదం చేస్తాయి. దీని వల్ల ఉద్యోగాల కల్పన పెరగడమే కాక, పారిశ్రామిక వృద్ధికి అవకాశం కలుగుతుంది. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాల యూనిట్లలో కావలసిన విడిభాగాలను అమర్చాలంటే ఆ విడిభాగాలు 90% చైనా నుంచే దిగుమతి అవుతున్నాయి. ఇప్పుడు చైనా పరిశ్రమలు ఈయూనిట్లపైనే దృష్టి కేంద్రీకరిస్తాయి. ప్రస్తుత పరిణామాల ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఆంక్షలను సడలించినా, చైనా పెట్టుబడులు మన దేశంలోకి వెల్లువలా వస్తాయా అన్నదే ప్రశ్న. చారిత్రకంగా పరిశీలిస్తే భారత్‌లో ఇతోధికంగా చైనా పెట్టుబడులు పెట్టే అనుభవాలు ఎప్పుడూ లేవు ఈ విషయంలో చైనా చొరవ ఎప్పుడూ పరిమితమే. ముఖ్యంగా సాంకేతిక పరిజ్ఞానం బదిలీ కావలసిన పరిశ్రమలకు పెట్టుబడులు భారీగా పెట్టడానికి చైనా ఎంతవరకు ముందుకు వస్తుందో చెప్పలేం. సంఘర్షణలు జరగని పూర్వకాలంలో కూడా భారత్‌లోని పారిశ్రామిక ప్రగతి కోసం ఎలక్ట్రానిక్, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ వంటి కీలకమైన రంగాలకు సాంకేతిక పరిజ్ఞానం అందించడానికి చైనా ముందుకు రాలేదు. చైనా ఎగుమతులపై అత్యధికంగా మనం ఎందుకు ఆధారపడవలసి వస్తుందో సమీక్షించుకోవలసి ఉంది. దీనికి దారితీసే మౌలిక వనరుల కొరత, నిపుణుల లభ్యత, తగిన పెట్టుబడులతో తయారీ పరిశ్రమల ఏర్పాటు ఇవన్నీ సాధ్యమైతేనే అనుకున్న ఫలితాలు లభిస్తాయి.

## బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేశ్‌పై మరో కేసు

బాపట్ల, బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేశ్‌పై మరో కేసు నమోదైంది. మంత్రి సత్యకుమార్ యాదవ్‌పై గతేడాది దాడికి సంబంధించి నందిగం సురేశ్‌పై తుళ్లూరు పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. బోరుగడ్డ అనిల్ కుమార్ పేరును కూడా ఈ కేసులో చేర్చారు. ఇందులో ఏ1గా నందిగం సురేశ్, ఏ2గా బోరుగడ్డ అనిల్ పేర్లు ఉన్నాయి. గత ఏడాది మార్చి 31న అమరావతి ఉద్యమంలో భాగంగా రాజధాని గ్రామమైన మందడంలో నిర్వహించిన సమావేశానికి సత్యకుమార్ యాదవ్, మరికొందరు నేతలు వచ్చారు. తిరిగి వెళ్తున్న సమయంలో మూడు రాజధానుల శిబిరం వద్ద అప్పటి బాపట్ల ఎంపీ నందిగం సురేశ్, వైసీపీ నాయకుడు బోరుగడ్డ అనిల్ అడ్డుకున్నారు. తమ అనుచరులతో కలిసి ఇనుప రాడ్లు, రాళ్లతో దాడి చేశారు. ఈ సమయంలో నందిగం సురేశ్ తన అనుచరులను రెచ్చగొట్టినట్లు బీజేపీ యువజన నాయకుడు సురేశ్ తెలిపారు.

# జగన్ పాలనలో రాష్ట్రం అధఃపాతాళంలోకి

విశాఖపట్నం,గత ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రం అధ:పాతాళంలోకి వెళ్లిపోయిందని, కొత్త పరిశ్రమల స్థాపన, పెట్టుబడులపై దృష్టి పెట్టలేదని 20 పాయింట్స్ చైర్మన్ లంకా దినకర్ విమర్శలు గుప్పించారు. శనివారం వైజాగ్ డెవలప్మెంట్ కౌన్సిల్, ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, ఏపీ టూర్ అండ్ ట్రావెలర్ ఆపరేటర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో లంకా దినకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధిలో అగ్రగామిగా ఏపీని తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్ర.. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని అన్నారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యానికి అనుగుణంగా ముందుకు వెళుతున్నామని తెలిపారు. పెట్టుబడుల ఆకర్షణ, ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించడమే తమ లక్ష్యమని వెల్లడించారు. ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమంతో దేశం అభివృద్ధి చెందుతోందన్నారు. పరిశ్రమల పునరుద్ధరణ కోసం త్వరలోనే ఒక ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రీన్ ఎనర్జీకి సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ వలన రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతోందన్నారు. దేశానికి ముంబాయి ఎలాగో.. ఏపీకి ఆర్థిక రాజధాని విశాఖ అని లంకా దినకర్ పేర్కొన్నారు. వైజాగ్ డెవలప్మెంట్ కౌన్సిల్, ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, ఏపీ టూర్ అండ్ ట్రావెలర్ ఆపరేటర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు విశాఖ ఎంపీ భరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో నూతన పెట్టుబడుల పాలసీలు, అవకాశాలపై సమావేశంలో చర్చించనున్నారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ.. ఏపీలో అన్ని వర్గాల ప్రజలు కష్టాలు వినే ప్రభుత్వం వచ్చిందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. జీవీఎంసీ వద్ద నిధులు లేవని... నగరంలో సీసీ కెమెరా ఏర్పాటుకు సీఎస్ఆర్ నిధులు ఇవ్వడానికి ముందుకు రావాలన్నారు. విశాఖ అభివృద్ధికి అందరూ సహకరించాలని ఎంపీ భరత్ కోరారు. ఈ సదస్సులో ఎమ్ ఎస్ ఎమ్ ఈ చైర్మన్ శివ శంకర్, ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ బాలాజీ, పలువురు పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

# ధరల నియంత్రణపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

అమరావతి, ధరల నియంత్రణ, మార్కెట్ ఇంటర్వెన్షన్లపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ధరల నియంత్రణ, మార్కెట్ ఇంటర్వెన్షన్లపై మంత్రుల కమిటీని సర్కార్ ఏర్పాటు చేసింది. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నేతృత్వంలో మంత్రుల కమిటీ ఏర్పాటైంది. కమిటీలో సభ్యులుగా వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, పౌరసరఫరాల శాఖ ఎక్స్‌అఫీషియో కార్యదర్శి ఈ కమిటీకి కన్వీనర్‌గా ఉంటారని ప్రభుత్వం పేర్కొంది. నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు ఆకస్మికంగా ఎందుకు పెరుగుతున్నాయన్న అంశంపై అధ్యయనం చేయాలని ఆదేశాలు జారీ చేసింది. నిత్యావసరాలు, కూరగాయల ధరల తగ్గింపునకు చేపట్టాల్సిన చర్యలపైనా సిఫార్సులు చేయాలని కమిటీకి ప్రభుత్వం సూచించింది. ఉత్పత్తి, సప్లై, డిమాండ్ , ధరలకు సంబంధించిన అంశాలు, పంటల తీరు, ఎగుమతులు, దిగుమతులపై కూడా అధ్యయనం చేయాల్సిందిగా ఆదేశించింది. వినియోగదారులకు అందుబాటు ధరల్లో నిత్యావసరాలు, కూరగాయలు లభించేలా తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలని తెలిపింది. ధరలు నియంత్రణలోకి తెచ్చేందుకు అవసరమైన యంత్రాంగం రూపకల్పనకు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు వీలుగా ఈ అంశాలపై ఓ డేటా బేస్‌ను ఏర్పాటు చేయాలని ఆర్డర్స్ వేసింది. ధరలు పెరిగినప్పుడు మార్కెట్ ఇంటర్వెన్షన్‌ను అమలు చేసేలా శాశ్వత ప్రాతిపదికన ధరల నియంత్రణ నిధిని ఏర్పాటు చేసేందుకు సూచనలు ఇవ్వాలని వెల్లడించింది. ధరల పెరుగుదల , నియంత్రణ, మార్కెట్ ఇంటర్వెన్షన్లపై అధికారుల కమిటీ ఇచ్చిన సిఫార్సులను అధ్యయనం చేయాలని సూచించింది. ఆహార పంటలు, నిత్యావసరాలకు సంబంధించి ఉత్పత్తి, సరఫరా, నిల్వలకు సంబంధించి దీర్ఘ, స్వల్పకాలిక ప్రణాళికల అమలుపైనా ప్రభుత్వం సిఫార్సులు కోరింది. ఉత్పత్తి, నిల్వల్లో ఆధునిక టెక్నాలజీ వినియోగం ద్వారా ఏడాది పొడవునా ధరల్ని నియంత్రణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేసింది. వ్యవసాయదారులు, మిల్లర్లు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ , ఆహారధాన్యాలు, పప్పు దినుసులు, వంటనూనె డీలర్లు, ఎగుమతి, దిగుమతిదార్లతో సమావేశం కావాలని ఆదేశించింది. అధ్యయనం అనంతరం తదుపరి నిర్ణయం కోసం సమగ్ర నివేదిక సమర్పించాలని మంత్రుల కమిటీకి ఏపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## నాలుగు గంటల్లోనే హైదరాబాద్ టు విశాఖపట్నం

విశాఖపట్నం,హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లాలంటే ఎంత సమయం పడుతుంది? సాధారణ రైళ్లలో వెళ్తే 12 గంటలు.. అదే వందేభారత్ రైలులో అయితే 8.30 గంటల్లోనే వెళ్లొచ్చు. కానీ అదే నాలుగు గంటల్లోనే హైదరాబాద్ నుంచి వైజాగ్ వెళ్లగలిగితే ఎలా ఉంటుంది.. అతి త్వరలోనే ఆ కోరిక తీరబోతుంది. హైదరాబాద్ నుంచి వైజాగ్ మధ్య రైలు ప్రయాణ సమయాన్ని తగ్గించే ప్రాజెక్టుకు సంబంధించిన ప్రణాళిక కీలక దశకు చేరుకుంది. ఈ మేరకు శంషాబాద్ నుంచి విశాఖపట్నం మధ్య సెమీ హైస్పీడ్ రైలు కారిడార్ ఎలైన్‌మెంట్ ఖరారైంది. సికింద్రాబాద్ నుంచి వైజాగ్‌కు ప్రస్తుతం రెండు మార్గాల్లో రైళ్లు వెళ్తున్నాయి. మొదటిది వరంగల్-ఖమ్మం-విజయవాడ మార్గం. రెండోది నల్గొండ-గుంటూరు-విజయవాడ. ఈ రెండు మార్గాల్లో గంటకు 110 నుంచి 130 కి.మీ. వేగంతో రైళ్లు ప్రయాణిస్తున్నాయి. కానీ గంటకు 220కి.మీ. వేగంతో రైల్లు ప్రయాణించేలా ఇప్పుడు కొత్త మార్గాలను రైల్వే శాఖ ప్రతిపాదించింది. ఇందులో ఒకటి హైదరాబాద్ -విజయవాడ జాతీయ రహదారిని అనుకుని ఉన్నట్లుగానే ఉంటుంది. దీన్ని సూర్యాపేట, విజయవాడ మీదుగా మొదటి మార్గాన్ని ప్రతిపాదించింది. ఇందులో భాగంగా వైజాగ్ నుంచి విజయవాడ, సూర్యాపేట మీదుగా కర్నూలుకు మరో కారిడార్‌ను నిర్మించనున్నారు. ఇది వైజాగ్ నుంచి మొదలై సూర్యాపేట, నల్గొండ, కల్వకుర్తి, నాగర్‌కర్నూలు మీదుగా కర్నూలు చేరుతుంది. వీటి ప్రిలిమినరీ ఇంజనీరింగ్, ట్రాపిక్ (పెట్) సర్వే తుది దశకు చేరింది. ఈ సర్వే నివేదికను నవంబరులో రైల్వే బోర్డుకు సమర్పించనున్నట్లు తెలుస్తోంది. ఈ మార్గంలో శంషాబాద్, రాజమండ్రి విమానాశ్రయాలకు అనుసంధానించేలా ఈ ప్రణాళికను రూపొందించడం విశేషం.

# జన్వాడ ఫామ్‌హౌస్ పార్టీ కేసు.. రంగంలోకి కేసీఆర్!



హైదరాబాద్,తెలంగాణ రాజకీయాల్లో జన్వాడ ఫామ్ హౌస్ కేసు సంచలనంగా మారింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బావమరిది రాజ్ పాకాలకు చెందిన జన్వాడ ఫామ్ హౌస్‌లో రేవ్ పార్టీ జరిగిదంటూ సైబరాబాద్ ఎస్వోటీ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో సుమారు 35మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో పురుషులు, మహిళలు ఉన్నారు. అక్కడ విదేశీ మద్యం సహా భారీగా మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ యాక్ట్ సెక్షన్ 34 కింద కేసు నమోదు చేశారు. అయితే, ఈ పార్టీలో కొందరు డ్రగ్స్ ను కూడా వినియోగించినట్లు ప్రచారం జరిగింది. పార్టీలో పాల్గొన్న కొందరికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. ఓ వ్యాపారవేత్త కొకైన్ తీసుకున్నట్లు నిర్ధారణ అయింది. దీంతో ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు.. ఆయనను అదుపులోకి తీసుకొని విచారించారు. పోలీసుల విచారణలో కేటీఆర్ బావమరిది ఆఫర్ చేస్తేనే తాను కొకైన్ తీసుకున్నట్లు ఆయన చెప్పినట్లు ప్రచారం జరుగుతున్నది. ఇంతకూ కొకైన్ రాజ్ పాకాలకు ఎక్కడి నుండి వచ్చింది.. దీని వెనక ఉన్న ముఠా ఎవరు? ఎన్నేళ్ల నుండి డ్రగ్స్ సరఫరా అవుతుందనే విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.ఫామ్‌హౌస్ పార్టీ కేసులో ఏ1గా ఫామ్‌హౌస్ సూపర్‌వైజర్ కార్తిక్, ఏ2గా రాజ్ పాకాలను చేర్చారు. అయితే, రాజ్ పాకాల పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసులో విషయంలో ఉదయం 10 గంటలకు ఎక్సైజ్ కార్యాలయం, 2గంటలకు మోకిలా పోలీస్ స్టేషన్ విచారణకు రావాలని రాజ్ పాకాలకు పోలీసులు ఆదేశించినప్పటికీ ఆయన డుమ్మా కొట్టారు. మొబైల్ స్విచ్ఛాఫ్ చేసుకుని అందుబాటులోకి రాలేదు. దీంతో రాయదుర్గంలోని ఓరియన్ విల్లాలో రాజ్ పాకాల ఉన్నట్లు సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించేందుకు అక్కడికి వెళ్లగా.. విల్లాకు తాళంవేసి ఉండటంతో వారు కొద్దిసేపు అక్కడే వేచి ఉన్నారు. సమీపంలోని మరో విల్లాలో ఉన్నారని సమాచారం రావడంతో అధికారులంతా అక్కడికి వెళ్లారు. ఈలోగా భారీ సంఖ్యలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు అక్కడికి చేరుకొని ఆందోళనకు దిగారు. సెర్చ్ వారెంట్ లేకుండా ఎలా తనిఖీ చేస్తారని ప్రశ్నించారు.ఫామ్‌హౌస్ కేసుపై కేటీఆర్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనపై ప్రశ్నించినందుకే రాజకీయంగా సమాదానం చెప్పలేక ఇలాంటి కుట్రలకు తెరతీస్తున్నారని, మా ధైర్యాన్ని దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. దీపావళి పండుగ సందర్భంగా దావత్ చేసుకోవడం తప్పా..? గృహ ప్రవేశం సందర్భంగా బంధువులను పిలిచి దావత్ ఇచ్చారు. కొందరు రేవ్ పార్టీ అని ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం అది కుటుంబ పార్టీ మాత్రమేనని.. అందులో చిన్న పిల్లలతో పాటు వృద్ధులు, కుటుంబాలకు చెందిన భార్యాభర్తలు పాల్గొన్నారని కేటీఆర్ అన్నారు. జన్వాడ ఫామ్‌హౌస్ పార్టీలో డ్రగ్స్ వినియేగించారనే వార్తలు రావడంతోపాటు.. కేటీఆర్ సతీమణికూడా పాల్గొన్నారని ప్రచారం జరగడం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. బీజేపీ ఎంపీలు బండి సంజయ్, రఘునందన్ రావులు మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి కీలక వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్ మాట్లాడుతూ.. ఫాంహౌజ్ లో రేవ్ పార్టీ కేసును కేసును కాంగ్రెస్ ప్రభుత్వం నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. పార్టీలో పాల్గొన్న వారందరి పేర్లను బహిర్గతం చేయాలని, డ్రగ్స్ వినియోగం విషయంపై నిగ్గుతేల్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ అనుబంధం కారణంగానే ఈ కేసులో విషయాలను బయటకు రాకుండా కాంగ్రెస్ పెద్దలు పోలీసు ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోందని అన్నారు. రఘునందన్ రావు మాట్లాడుతూ.. ఫామ్ హౌస్, దాని పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరా ఫుటేజ్‌లను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. మరోవైపు కొందరు కాంగ్రెస్ నేతలు మీడియా ముందుకొచ్చి కేసీఆర్ కుటుంబం టార్గెట్‌గా విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నదని బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయంగా కేటీఆర్‌ను ఎదుర్కోలేక కుటుంబ సభ్యులను టార్గెట్‌గా చేసుకొని అసత్య ప్రచారం చేస్తున్నారని, రాజకీయాల్లో ఇలాంటి పరిణామాలు సరికాదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, ఈ కేసుపై ఇప్పటి వరకు పోలీసులు మీడియా ముఖంగా ఎలాంటి ప్రకటనలు చేయలేదు. దీంతో నిజంగానే పార్టీలో డ్రగ్స్ వినియోగం జరిగిందా అనే అంశం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల తరువాత నుంచి ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. అయితే, తాజాగా జన్వాడ ఫామ్ హౌస్ పార్టీ కేసుకు సంబంధించి కేసీఆర్ స్పందించారు. ఈ కేసుకు సంబంధించిన విషయాల గురించి స్వయంగా రాష్ట్ర డీజీపీకి కేసీఆర్ ఫోన్ చేసి ఆరా తీశారు. పార్టీ కేసుకు సంబంధించి ఫామ్ హౌస్ యజమాని రాజ్ పాకాల, అతని కుటుంబ సభ్యుల గృహాలపై పోలీసులు ఉ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలపై డిజిపితో ఫోన్లో కేసీఆర్ మాట్లాడుతూ .. సర్చ్ వారెంట్ లేకుండా సోదాలు ఎందుకు చేస్తున్నారని, వెంటనే సోదాలను ఆపాలని డిమాండ్ చేశారు. అలాగే రాజ్ పాకాల, అతని సోదరుడు శైలేంద్ర గృహాలలో సోదాలను నిర్వహిస్తున్న తీరుపై కేసీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. గత కొద్దిరోజులుగా సైలెంట్ గా ఉంటున్న కేసీఆర్ ప్రస్తుత పరిణామాలపై రియాక్ట్ కావటంతో ఆయన ఇక నుంచి పాలిటిక్స్ లో యాక్టివ్ అవుతారని పరిశీలకులు భావిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ కుటుంబాన్ని బదనాం చేసేందుకు ప్రయత్నిస్తున్నదని, వారికి సరైన గుణపాఠం చెప్పేందుకు కేసీఆర్ మళ్లీ పాలిటిక్స్ లో యాక్టివ్ కాబోతున్నారని బీఆర్ ఎస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అధికారం కోల్పోయిన తరువాత కేసీఆర్ ఒక్కసారి కూడా కాంగ్రెస్ నేతలకు ఎదురుపడలేదు. అసెంబ్లీ సమావేశాలకు డుమ్మా కొట్టారు. కేవలం బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజు మాత్రమే అసెంబ్లీకి కేసీఆర్ వచ్చారు. ఆ సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై అసంతృప్తి వ్యక్తం చేసి.. ఇక నుంచి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తానని హెచ్చరించారు. అయితే, ఆ తరువాత కూడా కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితమయ్యారు. తాజాగా జన్వాడ ఫామ్‌హౌస్ కేసుకు సంబంధించి కేసీఆర్ స్పందించడంతో.. ఇకనుంచి ఆయన పాలిటిక్స్ లో యాక్టివ్ అవుతారనే చర్చ జరుగుతున్నది.

# ఇది చక్కదిద్దాలంటే వైఎస్ దిగి రావాలి



హైదరాబాద్,వైఎస్ రాజశేఖరరెడ్డి జీవించి ఉన్న సమయంలో గడప దాటి ఎరుగని కుటుంబ సభ్యులు ఇప్పుడు ఏకంగా రోడ్డునే పడ్డారు. ఎవరు బయటకు లాగారు? ఎవరు రోడ్డెక్కించారన్నది పక్కన పెడితే.. మొత్తంగా నాలుగు మాసాల కిందట రాజకీయంగా వీధిన పడితే.. ఇప్పుడు ఆస్తుల పరంగా వీధి పోరాటాలకు దిగారు.ఈ తరహా పరిస్థితిని బహుశ రాజశేఖరరెడ్డి ఎప్పుడూ ఊహించి ఉండరు. ఎందుకంటే.. ఆయన జీవితంలో అనేక మంది వివాదాలను సెటిల్ చేశారనే పేరుంది. మాజీ పీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి కుటుంబంలో తగాదాలు వస్తే.. గుట్టు చప్పుడు కాకుండా సర్దుబాటు చేసింది వైఎస్సేనని ఒక సందర్భంలో ఆయన చెప్పుకొన్నారు.అదేవిధంగా కనుమూరి బాపిరాజు, పర్వతనేని ఉపేంద్రల కుటుంబ వ్యవహారాలను కూడా వైఎస్ రాజశేఖరరెడ్డి సర్దుబాటు చేశారని రాజకీయ వర్గాలు చెబుతాయి. ఇక, ఎంతో పెద్ద కుటుంబం అయిన వైఎస్ ఫ్యామిలీ(రాజారెడ్డి పిల్లలు)లో ఆస్తుల వివాదాలు.. పంపకాలు వంటివి మూడో కంటికి తెలియకుండా సాగిపోయాయంటే.. పెద్దన్నగా రాజశేఖరరెడ్డి వ్యవహరించిన తీరు ను స్పష్టం చేసింది.కొన్నాళ్ల కిందట వైఎస్ రాజశేఖరరెడ్డి, వివేకానందరెడ్డిల ఏకైక సోదరి విమలమ్మ ఇదే చెప్పుకొచ్చారు. తమ కుటుంబంలో ఎప్పుడూ పొరపొచ్చాలు రాలేదని.. ప్రతి విషయాన్నీ ఎంతో జాగ్రత్తగా కూర్చుని చర్చించుకుని పరిష్కరించుకున్నారని ఆమె చెప్పుకొచ్చారు.అందుకే.. అంత పెద్ద కుటుంబంలో.. ఎన్ని ఆస్తులు ఉన్నాయో.. ఎవరెవరికి ఏమేం పంచుకున్నారో.. కూడా మూడో వ్యక్తికి తెలియనంతగా వైఎస్ కుటుంబం జాగ్రత్త పడింది. కానీ, ఇప్పుడు అనూహ్య పరిణామాలకు రాజకీయ వివాదాలు, విభేదాలు, కక్షలు తోడై.. వైఎస్ కుటుంబం నడిరోడ్డున పడి నగుబాటు అవుతున్న పరిస్థితి కనిపిస్తోంది.ప్రస్తుతం జరుగుతున్న వివాదాలు.. మీడియాకు హైప్ కావొచ్చు.. లేదా ఓ వర్గం రాజకీయ నేతలకు విందు కూడా కావొచ్చు. కానీ, ఎంతో గుంభనంగా వ్యవహరించిన వైఎస్ కుటుంబానికి వన్నె తీసుకురాబోవన్నది వాస్తవం. అంతేకాదు.. వైఎస్ అంటే కరడుగట్టిన అభిమానం ఉన్న పెద్దలు కూడా ఎటూ తేల్చుకోలేని పరిస్థితిని ప్రస్తుత వివాదం కల్పించడం మరో విషయం.వెరసి.. ఈ వ్యవహారంలో జగన్ అనుసరిస్తున్న తీరు తప్పయితే.. ఆయనే ఆత్మ విచారం చేసుకుని.. పరిస్థితిని చక్కదిద్దాలి. లేకపోతే.. వైఎస్ కుటుంబానికి మిగిలి ఉన్న పెద్దనాయకుడిగా.. పెట్ట కుటుంబ సభ్యుడిగా ఆయనే నవ్వుల పాలవుతారు. ఇదే సమయంలో వైఎస్ పేరుతో ఆయన చేస్తున్న రాజకీయం, వ్యాపారాలు కూడా అనుమానపు చట్రంలో బంధీలవుతాయి.షర్మిల ఆవేదన, ఆక్రోశంలో అర్థం పరమార్థం సంగతి ఎలా ఉన్నా..జగన్ అనుసరిస్తున్న తీరు ఇప్పుడు చర్చగా మారింది. వాస్తవాలు ఎలా ఉన్నా.. సోదరిని సంతృప్తి పరచడమే ఇప్పుడు జగన్ ముందున్న ప్రథమ కర్తవ్యంగా భావించాల్సిన అవసరం ఉంది.

# మెట్రో రైల్ రెండో దశతో ట్రాఫిక్ కష్టాలకు చెక్!



హైదరాబాద్ : హైదరాబాద్ మెట్రో రైల్ రెండవ దశ ప్రాజెక్ట్ కు లైన్ క్లియర్ అయింది. దీంతో నగర ప్రజల ట్రాఫిక్ కష్టాలకు చెక్ పడనుంది. సిటీ విస్తరిస్తున్న కొద్దీ ట్రాఫిక్ రద్దీ పెరగటంతో ఇప్పుడున్న మెట్రోను ఇతర మార్గాలకు విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. అందుకు సంబంధించిన డిపిఆర్ కు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. రూ.24,269 కోట్ల అంచనాలతో చేపట్టే మెట్రో రెండో దశకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం రాగానే పనులు మొదలు పెట్టి రాబోయే నాలుగు సంవత్సరాలలో పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుంది.హైదరాబాద్ మెట్రో రైల్ మొదటి దశలో మూడు కారిడార్లలో 69 కిలోమీటర్ల విజయవంతంగా సేవలందిస్తోంది. ఈ ప్రాజెక్టును ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో రూ.22 వేల కోట్ల తో నిర్మించారు. ప్రస్తుతం రోజుకు దాదాపు 5 లక్షల మంది మెట్రోలో ప్రయాణిస్తున్నారు. రెండో దశ అందుబాటులోకి వస్తే సిటీలో రోజుకు మరో 8 లక్షల మంది మెట్రోలో ప్రయాణిస్తారు. మెట్రో రైల్ మొదటి దశ అమలైనప్పుడు హైదరాబాద్ దేశంలోనే ఢిల్లీ తర్వాత 2వ స్థానంలో నిలిచింది. గత ప్రభుత్వం ఏడేండ్లుగా మెట్రో విస్తరణను పట్టించుకోలేదు. ఈలోపు మిగిలిన నగరాలన్నీ రెండో, మూడో దశ నిర్మాణ కార్యక్రమాలు కూడా పూర్తి చేశాయి. గత ప్రభుత్వం నిర్వాకంతో ఒకప్పుడు 2వ స్థానంలో ఉన్న హైదరాబాద్ ఇప్పుడు దేశంలో 9వ స్థానానికి పడిపోయింది. ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, కోల్‌కత్తా వంటి పెద్ద నగరాలతో పాటు, పూణే, నాగపూర్, అహ్మదాబాద్ లాంటి చిన్న నగరాలు కూడా మెట్రో విస్తరణలో హైదరాబాద్ ను అధిగమించాయి.గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఏడేండ్లు ఆలస్యం చేయటంతో తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం కూడా భారీగా పెరిగి పోయింది. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచే కొత్త ప్రభుత్వం మెట్రో విస్తరణపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. హైదరాబాద్ లో ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న మార్గాలతో పాటు అన్ని ప్రాంతాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని మెట్రోను విస్తరించాలని నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా రెండవ దశలో అయిదు కారిడార్లలో 76.4 కిలో మీటర్ల మేరకు మెట్రో విస్తరణకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీనికి సంబందించిన డిపిఆర్ (డిటైల్ ప్రాజెక్ట్ రిపోర్ట్) పూర్తయింది. ప్రస్తుతం మూడు కారిడార్లు ఉన్నాయి,

రెండో దశ లో ప్రతిపాదించిన కొత్త 5 కారిడార్ లు :

నాలుగో కారిడార్ : నాగోల్ నుండి శంషాబాద్ ఎయిర్ పోర్టు వరకు (36.8 కి.మీ)అయిదో కారిడార్ : రాయదుర్గ్– నుండి కోకాపేట్ నియోపొలిస్ వరకు (11.6 కి.మీ)ఆరో కారిడార్ : ఎంజిబిఎస్– నుండి చంద్రాయన్ గుట్ట వరకు (7.5 కి.మీ)ఏడో కారిడార్ : మియాపూర్– నుండి పటాన్‌చెరు వరకు (13.4 కి.మీ)ఎనిమిదో కారిడార్ : ఎల్ బి నగర్– నుండి హయత్ నగర్ వరకు (7.1 కి.మీ.)మెట్రో రెండవ దశను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పాటు పిపిపి విధానంలో చేపడుతాయి. ఈ ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం రూ.24,.269 కోట్లు. అందులో 30 శాతం అంటే రూ.7,313 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం, 18 శాతం అంటే రూ.4,230 కోట్లు కేంద్ర ప్రభుత్వం వెచ్చిస్తుంది. మిగతా 52 శాతం నిధులను రుణాలతో పాటు పిపిపి విధానంలో సమకూర్చుకుంటాయి.

# ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ నియామకం పట్ల హర్షం...





హైదరాబాద్,ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన టి పి సి సి రాష్ట్ర నాయకులు దరువు ఎల్లన్న,దుర్గం భాస్కర్ & ఓయూ జేఏసీ చైర్మెన్ కొత్తపల్లి తిరుపతి ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీలో నాణ్యమైన విద్యను అందరికి అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా విద్య విధి విధానాలు ఉండాలని, అంతేకాకుండా విద్య విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరిచే విధంగా ఉండాలని అందుకు విద్యావస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టవల్సిన అవసరం ఉందన్నారు.విద్యను పరిశ్రమల కు అనుసంధానం చేయవలసిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. అందుకు ప్రభుత్వం నియమించిన ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ గారి తో విద్యలో సమూల మార్పులు మరియు ఉపాధి అవకాశాలు చోటుచేసుకుంటాయని అనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో గజరాజు జోషి, ప్రశాంత్, గోపాల్, అరుణ్, దేవేందర్, ఆంజనేయులు, శోభన్, శ్రీనివాస్, ప్రవీణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇది కదా.. బాబుకు బ్యాడ్‌నేమ్!



విజయవాడ:అది టీడీపీకి గట్టి పట్టున్న నియోజకవర్గం. జిల్లా కూడా. ఏదైతే.. జరగకూడదని రెండు రోజులుగా వరుస పెట్టి నాయకులకు టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారో.. అదే ఆ జిల్లాలోను, ఆ నియోజకవర్గంలోనూ జరిగింది. దీనివెనుక బలమైన నాయకులు, నియోజకవర్గాన్ని, జిల్లాను సైతం శాసించగల నాయకులు ఉండడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి.

ఏం జరిగింది?

రాష్ట్రంలో నూతన మద్యం విధానం అమల్లోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. మద్యం వ్యాపారం నుంచి ప్రభుత్వం తప్పుకొని ప్రైవేటుకు కట్టబెట్టింది. తద్వారా సర్కారుకు బ్యాడ్ నేమ్ రాకుండా జాగ్రత్త పడింది. ఈ క్రమంలోనే బెల్టు షాపులు వద్దని.. ఈ విషయంలో పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు చాలా చాలా దూరంగా ఉండాలని కూడా.. చంద్రబాబు చెప్పుకొచ్చారు. రెండు రోజుల పాటు వీడియో కాన్ఫరెన్స్ పెట్టి మరీ నాయకులకు క్లాస్ ఇచ్చారు.కానీ, నాయకులు చంద్రబాబు చెప్పిన మాటలను విని.. వదిలేశారు. తమ పద్ధతిలో తాము నడుస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని తణుకు, తుని సహా పలు నియోజకవర్గాల్లో ఆదివారం సంతలు నిర్వహిస్తారు. ఈ సంతలు నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహిస్తారు. వీటిలో బహిరంగంగానే మద్యాన్ని పెట్టి విక్రయించారు. ఇవన్నీ బెల్టు షాపులు. పైగా వీటిని పెట్టిన వారు కూడా టీడీపీ సానుభూతిపరులు. అంటే.. కీలక నేతలే వీటిని పెట్టించారనే విషయం ఇక్కడ చర్చగా మారింది. వారి అండ లేకపోతే.. ఎవరూ ముందుకు వచ్చే పరిస్థితి కూడా లేదు.ప్రస్తుతం ఈ బెల్టు షాపులకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాను కుదిపేస్తున్నాయి. మరి దీనిని బట్టి.. చంద్రబాబు చెప్పింది.. నాయకులకు అర్థం కావడం లేదా? లేక.. బాబు ఏం చెప్పినా.. తాము చేయాల్సింది చేయాలని అనుకుంటు న్నారా? అనేది తెలియాల్సి ఉంది. ఏదేమైనా.. ఇది కదా.. బాబుకు బ్యాడ్ నేమ్ తీసుకురావడం అంటే! అనే కామెంట్లు మాత్రం టీడీపీ సానుభూతి పరుల నుంచి వినిపిస్తున్నాయి.

## శ్రీవారి ఆదాయం రూ. 3.78 కోట్లు

తిరుపతి: తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. కలియుగ ప్రత్యక్షదైవం, ఆపదమొక్కులవాడు వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో 5 కంపార్టుమెంట్లు నిండిపోయాయి. టోకెన్లు లేని భక్తులకు 6 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని ఆలయ అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 56,501 మంది భక్తులు దర్శించుకోగా 21,203 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.78 కోట్లు వచ్చిందన్నారు.

# విజయమ్మ రంగంలోకి దిగుతారా ?



హైదరాబాద్,ఏపీలో జగన్ వర్సెస్ షర్మిల ఇష్యూ ఎటూ తెమలడం లేదు. అది రావణ కాష్టంగా సాగుతోంది. ఇంకా చెప్పాలీ అంటే వివాదం పీక్స్ కి చేరుకుంది. ఆస్తుల వివాదంలో ఎవరికి రైట్ ఎవరిది రాంగ్ అన్నది కూడా అర్థం కావడం లేదు. నలుగురు మనవళ్ళకు సమానంగా ఆస్తుల పంపిణీ జరగాలన్నది వైఎస్సార్ ఇచ్చిన మాండేట్ అని షర్మిల చెబుతున్నారు.అయితే జగన్ స్వార్జితంగా వచ్చిన ఆస్తుల మీద షర్మిలకు హక్కు ఏమి ఉంటుందని వైసీపీ నేతలు తిప్పి కొడుతున్నారు. ఇక వైఎస్సార్ తో సన్నిహితంగా ఉండేవారి అందరికీ వైఎస్సార్ మనసు ఏమిటో తెలుసు అని కూడా షర్మిల చెబుతోంది. ఆమె ఆ జాబితాలో వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి పేర్లను ప్రముఖంగా ప్రస్తావించింది.అయితే ఈ ఇద్దరూ కూడా షర్మిల మీదనే గట్టిగా విరుచుకుని పడ్డారు. షర్మిల చెబుతున్నది తప్పు అని అంటున్నారు. ఆమె నానా యాగీ చేస్తోంది అని కూడా అంటున్నారు. ఆమె చంద్రబాబు మాటలు తన నోటి వెంట మాట్లాడుతున్నారని అంటున్నారు.ఇక షర్మిల కన్నీరు ఓట్లు అన్నీ మీడియా ముందు అయిపోయాయి. అన్నీ తన తల్లి విజయమ్మకు తెలుసు అని ఆమె ఎంతో కుమిలిపోతున్నారు అని కూడా అంటున్నారు. మరి ఒక విధంగా అన్నీ తెలిసిన వారు విజయమ్మే అయి ఉంటారని అంతా అనుకుంటున్నారు. ఆమె బయటకు వచ్చి విషయం చెబితేనే ఈ విషయంలో క్లారిటీ వస్తుందని అంటున్నారు.అయితే విజయమ్మకు గిఫ్ట్ కింద రాసిచ్చిన షేర్లను షర్మిల తన పేరిట మార్పించుకుంది అన్నదే కదా అసలు అభియోగం అని అంటున్నారు. అంటే విజయమ్మ కుమార్తె వైపే ఉన్నారు అని అనుకోవచ్చా అంటే ఆమెకు ఏమీ తెలియదు అనే వారూ ఉన్నారు. ఆమె కుమార్తె పక్షమే అని చెప్పేవారూ ఉన్నారుఏది ఏమైనా కూతురు దగ్గర ఉంటున్న విజయమ్మ ఈ సమయంలో బయటకు వచ్చి చెబుతారా అని కూడా అంటున్నారు. ఒక వేళ ఆమె చెబితే ఏమి చెప్పవచ్చు అన్నది మరో చర్చ. ఆమె మొగ్గు కుమార్తె వైపు అన్నది ఎన్నికల వేళ ఆమె విడుదల చేసిన వీడియో బైట్ ద్వారానే అర్థం అయింది అని అన్న వారూ ఉన్నారు.అయితే ఆమెకు కుమారుడు కుమార్తె ఇద్దరూ సమానమే కాబట్టి ఆమె ఈ సమయంలో బయటకు వచ్చి రచ్చ చేసుకోలేరు అని కూడా మరో వాదన ఉంది. అయితే షర్మిల ఈ విషయంలో గట్టి పట్టుదలగా ఉన్నారు. కాబట్టి విజయమ్మను ఆమె ఒత్తిడి చేసి మీడియా ముందుకు తీసుకుని వచ్చి తన వాదన రైట్ అని నిరూపించుకునే అవకాశాలు ఉంటాయని అంటున్నారు. అదే సమయంలో ఆమె మీడియా ముందుకు రాకపోయినా తన బాధ ఇది తన ఆవేదన ఇది అని ఒక ప్రెస్ నోట్ అయినా రిలీజ్ చేసే అవకాశం ఉందని అంటున్నారుఒకవేళ ఆమె కనుక ఈ రెండింటిలో ఏది చేసినా ఆమె కుమార్తె షర్మిలకు ఏ కాస్తా అనుకూలంగా మాట్లాడినా అది వైసీపీకి ప్రత్యేకించి జగన్ కి గట్టి షాక్ అవుతుందని అంటున్నారు.మరి వారం రోజులుగా సాగుతున్న ఆస్తుల ఇష్యూలో కొత్త వారంలో కీలక పరిణామాలు జరిగే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.మరి విజయమ్మ కనుక రంగంలోకి దిగితే మాత్రం ఏపీలో రాజకీయంగా అగ్గి రాజుకోవడం ఖాయమనే అంటున్నారు. వైసీపీకి చూస్తే ఇది ఎంతో ఇబ్బందికరమైన పరిస్థితి గా మారింది అని అంటున్నారు. రాజ కీయాలను పక్కన పెట్టి కుటుంబ కలహాల మీద ఫోకస్ చేయడం అందులోనూ సున్నితమైన అంశాలకు జవాబులు చెప్పుకోవడం అంటే వైసీపీ పూర్తిగా ట్రబుల్స్ లో పడినట్లే అంటున్నారు. ఇంతకీ విజయమ్మ బయటకు వస్తారా లేక ఆమె వాయిస్ మీడియాకు ఏ రూపంలోనైనా ఇస్తారా అంటే వెయిట్ అండ్ సీ.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com